ఘనంగా తీజ్ వేడుకలు



6

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
www.andhrajyothy.com



20

నిర్మల్

గురువారం 24 ఆగస్టు 2017

డబుల్ ధమాకా



- ఎట్టకేలకు కదలిక
- గ్రామసభల ద్వారా లబ్ధిదారుల ఎంపిక
- లబ్ధిదారులతో సొసైటీల ఏర్పాటు
- ఆ సొసైటీలకే ఇళ్ల నిర్మాణాల బాధ్యత
- టూ వీలర్, రిఫ్రిజరేటర్, ల్యాండ్ లైన్‌ఫోన్ ఉన్న వారికి కట్
- కారున్నా, ఆటోరిక్షా ఉన్నా.. అనర్హులే
- ఈ నెల 26 నుంచి సెప్టెంబర్ 10 వరకు గ్రామసభలు
- సహకార శాఖ అధికారికి ప్రక్రియ నిర్వహణ భాధ్యత

గత మూడేళ్ల నుంచి గూడు లేని పేదలను ఊరిస్తూ వస్తున్న డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణ పథకానికి ఎట్టకేలకు కదలిక వచ్చింది. ప్రభుత్వం డబుల్ బెడ్‌రూం ఇళ్ల విషయంలో పలుమార్పులతో కూడిన తాజా నిబంధనలతో కూడిన ఉత్తర్వులను జారీ చేసింది. ఈ నిబంధనల ప్రకారం టూ, త్రీ, ఫోర్‌వీలర్ ఉన్న వారికి, ల్యాండ్‌ఫోన్, రిఫ్రిజరేటర్ ఉన్న వారికి ఇక డబుల్ బెడ్‌రూం ఇళ్లు మంజూరు కావు. అలాగే డబుల్ బెడ్‌రూం ఇళ్లను నిర్మించేందుకు కొన్ని గ్రామాలను ఎంపిక చేయనున్నారు. ఈ గ్రామాల ఎంపిక బాధ్యత జిల్లాస్థాయి అమలు కమిటీకి అప్పజెప్పారు. కాగా ఈ ఇళ్లు నిర్మించేందుకు కాంట్రాక్టర్‌లు ముందుకు రానట్లయితే అక్కడి ఎంపిక చేసిన లబ్ధిదారులతో సహకార సంఘాలను ఏర్పాటు చేసి ఆ సంఘాల ఆధ్వర్యంలో ఇండ్ల నిర్మాణాలను చేపట్టనున్నారు.

(ఆంధ్రజ్యోతి, నిర్మల్)

8



విద్యార్థికి సర్టిఫికెట్‌ను అందిస్తున్న మంత్రి అల్లోల

ఆరోగ్యవంతమైన సమాజం కోసం
ఎంఆర్ టీకా

- చిన్నారులకు ప్రాణాంతక వ్యాధులు సోకకుండా ఉండేందుకు టీకా వేయించాలి
- మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి

9

ప్రతిపక్షాల చేతిలో
కీలుబొమ్మ కోదండరాం



ప్రొఫెసర్ కోదండరాం ప్రస్తుతం ప్రతిపక్షాలతో లోపాయికారీ ఒప్పందం వల్ల ప్రభుత్వ వ్యతిరేక ఆందోళనకు ఆజ్యం పోస్తున్నారని ఢిల్లీలో తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి వేణుగోపాలచారి ఆరోపించారు.

8

పంటలపై అడవి పందుల బీభత్సం

పందులు నాశనం చేసిన మొక్కజొన్నను కోస్తున్న రైతులు



9



సమస్యలు పరిష్కరించాలని
బీడీ కార్మికుల ఆందోళన

- బీడీ ఫ్యాక్టరీ ముట్టడి, నిరసన ప్రదర్శనలు
- నాణ్యమైన బీడీ పేరిట వేధింపులకు పాల్పడుతున్నారని ఆరోపణ
- చాటన్ పేరిట శ్రమను దోపిడీ చేస్తున్నారని విమర్శ
- నిర్వాహక ప్రతినిధుల నిలదీత, వాగ్వాదం

9

ఇంటర్వ్యూ
I.N.T.E.R.V.I.E.W

జిల్లాలో క్రీడల అభివృద్ధికి
పాటుపడుతున్నాం

● జిల్లా యువజనుల క్రీడల అభివృద్ధి అధికారి శ్రీకాంతరెడ్డి



మందమర్రి : నూతనంగా ఏర్పడిన మంచిర్యాల జిల్లాలో క్రీడల అభివృద్ధికి పాటుపడుతున్నామని జిల్లా యువజనుల క్రీడల అభివృద్ధి అధికారి శ్రీకాంతరెడ్డి తెలిపారు. క్రీడాకారుల సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్నామని పేర్కొన్నారు. 'ఆంధ్రజ్యోతి'కి ఆయన ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు.

ప్ర : జిల్లాలో క్రీడల అభివృద్ధికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

అధికారి : జిల్లాలో క్రీడల అభివృద్ధికి పకడ్బందీ ప్రణాళికతో ముందుకు వెళ్తున్నాం. క్రీడాకారుల ఆటతీరును మెరుగుపరుచుకునే విధంగా శిక్షణ ఇస్తున్నాం. అలాలే ఆటగాళ్లకు ఫిట్‌నెస్ ఎంత ముఖ్యమో వారి క్రీడల్లో రాణించడం కూడ అంతే ముఖ్యమనే విధంగా సలహాలను అందజేస్తున్నాం.

ప్ర : జిల్లాలో ఏ క్రీడలపైనే విద్యార్థులు, యువకులు ఆసక్తి చూపుతున్నారు?

అధికారి : జిల్లాలో చాలా మంది విద్యార్థులు, యువకులు ఫుట్‌బాల్, వాలీబాల్, హ్యాండ్‌బాల్, కబడ్డీ, అథ్లెటిక్స్, బాక్సింగ్‌పై ఆసక్తి చూపుతున్నారు. ఈ క్రీడల్లో వారు బాగా రాణించేందుకు శిక్షణ అందజేస్తున్నాం. ఇటీవలే స్కూల్స్ అండ్‌గేమ్స్ అండర్-14, 15, 17 ఫుట్‌బాల్ పోటీలు నిర్వహించాం. ఈ పోటీలకు 500 మందికి పైగా హాజరయ్యారు.

ప్ర : జిల్లాలో ఎంత మంది కోచ్‌లు ఉన్నారు? ఎన్ని స్టేడియాలు మంజూరయ్యాయి?

అధికారి : జిల్లాలో ఆయా పాఠశాలలకు సంబంధించి 57 మంది పీఈటీలు పని చేస్తున్నారు. ఇం కా చాలా మంది పీఈటీలను నియమించాల్సి ఉంది. క్రీడలకు సంబంధించి కోచ్‌లకు ప్రత్యేక కోర్సు ఉంటుంది. ఎన్‌ఐఎస్ కోర్సు పూర్తి చేయడం కోసం కళాశాలలు పాటియాల, బెంగళూర్‌లో ఉన్నాయి. అందులో సర్టిఫికెట్ తీసుకున్నవారు ప్రొఫెషనల్ కోచ్‌లుగా పని చేసే అవకాశాలు ఉంటాయి. చెన్నూర్‌లో మినీ స్టేడియం నిర్మా ణానికి 2.60కోట్ల మంజూరయ్యాయి. స్టేడియంపనులు కొనసాగుతున్నాయి. అదే విధంగా మంచిర్యాలలో స్టేడియం ఏర్పాటుకు నిధులు మంజూరయ్యాయి. స్థల పరిశీలన జరుగుతోంది.

ప్ర : స్పెషల్ కోచింగ్ క్యాంప్‌లు నిర్వహిస్తున్నారా?

అధికారి : యేటా సమ్మర్‌కోచింగ్ క్యాంప్‌లు నిర్వహిస్తున్నాం. అన్ని క్రీడలకు సంబంధించి ఈ కో చింగ్ క్యాంప్‌లు జరుగుతుంటాయి. ఈ క్యాంప్‌ల్లో ప్రధానంగా ప్రత్యర్థి క్రీడాకారులు ఏ విధంగా ఉం టారో క్రీడల్లో మెలకువలు ఇస్తున్నాం. అంతేగాకుండా క్రీడాకారుల ప్రతిభకు పదనుపెట్టే విధంగా శిక్షణ ఇస్తున్నాం. అన్ని పాఠశాలల్లో క్రీడలు నేర్పించే విధంగా చూడాలని పీఈటీలకు సూచించాం.

టీఆర్ఎస్ ఎన్నికల మేనిఫెస్టోలో ఆర్ఎంపీ, పీఎంపీలకు శిక్షణ ఇచ్చి వారి సేవలను వాడుకుంటామని పేర్కొన్న నేపథ్యంలో ఆ దిశగా ప్రతిపాదనలు ఖరారు చేసింది. ఈ మేరకు సోమవారం వైద్య ఆరోగ్య శాఖ మంత్రి లక్ష్మారెడ్డి ఎంఆర్‌పీ, పీఎంపీల సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు, చైర్మన్ ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్, రాష్ట్ర ఆర్ఎంపీ, పీఎంల సంఘం నేతలతో సమావేశం ఏర్పాటు చేసి శిక్షణ ఇచ్చే విధివిధానాలపై చర్చించారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఒకే దఫా శిక్షణ ఇవ్వాలని నిర్ణయించారు. దీంతో కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలో పని చేస్తున్న ఆర్ఎంపీ, పీఎంపీలలకు లబ్ధి చేకూర నుంది. శిక్షణ కు జీవో 428 ప్రకారం ప్రభుత్వం రూ.4. 20 కోట్ల బడ్జెట్ కేటాయించింది.



వైద్య శిబిరంలో చికిత్స నిర్వహిస్తున్న సిబ్బంది(ఫైల్)

ఆర్ఎంపీ, పీఎంపీలకు శిక్షణ

● ప్రభుత్వ ఉత్తర్వులు ● జీవో 428 అమలుకు నిర్ణయం ● జిల్లాలో వంద మందికి లబ్ధి

చింతలమానెపల్లి : ఎన్నో ఏళ్లుగా గ్రామీణ ప్రాంతాల్లో ఆర్ఎంపీ, పీఎంపీలు ప్రజలకు సేవలందిస్తున్నారు. వీరికి ఎలాంటి గుర్తింపు ఇప్పటి వరకు లభించలేదు. అంతే కాకుండా ఎంఆర్‌పీ, పీఎంపీలపై డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్లు, పోలీసులు, జిల్లా వైద్యాధికారులు దాడులు నిర్వహించి కేసులు పెట్టిన సందర్భాలు సైతం చోటు చేసుకున్నాయి. గ్రామాల్లో స్వల్ప ఆరోగ్య సమస్యలొస్తే బాధితులు ఆర్ఎంపీ, పీఎంపీలనే సంప్రదిస్తారు. వారి సలహాల మేరకు రోగులు మందుల వాడకం చేపడుతారు. వ్యాధి తగ్గని నేపథ్యంలో వారు సూచించన మేరకు ఇతర వైద్యులను సంప్రదిస్తారు. ఇలా గ్రామీణ వ్యవస్థతో అనుబంధం పెంచుకున్న ఆర్ఎంపీ, పీఎంపీల సంఖ్య జిల్లాలో సుమారు 1100 మంది ఉన్నట్లు సమాచారం. జిల్లాలోని ప్రధానంగా మారుమూల మండలాలైన చింతలమానెపల్లి, బెజ్జూరు, పెంచికలపేట, కౌటాల, సిర్పూర్(టి), ఆసిఫాబాద్ డివిజన్‌లోని కెరమెరి, వాంకిడి, జైనూర్ తదితర మండలాల్లో వీరు ఎక్కువగా ఉన్నారు. కాగా ఇంత కాలం పాటు వారికి ఎలాంటి గుర్తింపు లేక పోయింది. ఈ మేరకు ఆ సంఘం సభ్యులు పలుమార్లు తమకు శిక్షణ ఇప్పించడం ద్వారా గుర్తింప ఇవ్వాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు టీఆర్ఎస్ ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ఆర్ఎంపీల సేవలను వినియోగించుకునేందుకు వారికి శిక్షణ అందించి సర్టిఫికెట్లు జారీ చేసే దిశగా చర్యలు చేపడుతోంది. అందుకు బడ్జెట్ సైతం విడుదలైంది.

ఆర్ఎంపీ, పీఎంపీలను గుర్తించడం సంతోషకరం..

-అజయ్‌కుమార్, సంఘం జిల్లా అధ్యక్షుడు



గ్రామీణ ప్రాంతాల్లో ఆర్ఎంపీ, పీఎంపీలు ప్రజలకు రాత్రనక, పగలనక రోగుల ఇళ్లకు వెళ్లి చికిత్సలు చేస్తున్నారు. కాగా వీరికి ఇంత కాలం పాటు ఎలాంటి గుర్తింపు లేకుండా పోయింది. ప్రభుత్వం ఆర్ఎంపీ, పీఎంపీలకకు శిక్ష ణ ఇచ్చి సర్టిఫికెట్లు జా రీ చేస్తామనడం హర్షణీయం.

శిక్షణ ఇస్తే మెరుగైన వైద్యం అందించవచ్చు..

- ఆగాడి సుధాకర్, ఎంఆర్‌పీ వైద్యుడు, కర్జెల్లి



కార్పొరేట్ ఆసుపత్రుల్లో, సర్టిఫైడ్ డాక్టర్ల వద్ద తీసుకున్న శిక్షణతో పేద ప్రజలకు తెలిసిన మేరకు అందించే అవకాశం ఉంటుంది. ప్రభుత్వ తీసుకున్న నిర్ణయంతో ఆర్ఎంపీ, పీఎంపీలకు లబ్ధి చేకూరే అవకాశం ఉంది. ఇంత కాలం నుంచి మేము చేసిన విజ్ఞప్తి మేరకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం అభినందనీయం.

ప్రభుత్వ నిర్ణయం హర్షణీయం...

- శంకర్, ఆర్ఎంపీ, పీఎంపీల సంఘం మండలాధ్యక్షుడు



ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం హర్షణీయం. త్వరగా శిక్షణ కార్యక్రమం ప్రారంభించాలి. జిల్లాలో పని చేస్తున్న ఆర్ఎంపీ, పీఎంపీలందరికి శిక్షణ అందించే విధంగా చర్యలు తీసుకోవాలి. ఈ నిర్ణయం తీసుకున్న వైద్యాశాఖ మంత్రి లక్ష్మారెడ్డి, ముఖ్యమంత్రికి ధన్యవాదాలు. సభ్యులు సైతం శిక్షణ తరగుతులను సద్వినియోగం చేసుకోవాలి.

ఆధ్యాత్మికం

వినాయకుడు ఏకదంతుడు ఎలా అయ్యాడు...

- గంగారపు వంశీకృష్ణ శర్మ, పూజారి





నస్పూర్ : కార్తవీరుడితిని వధించిన అనంతరం పరశురాముడు తన గురువైన పరమ శివుడని దర్శించుకోవాలని కైలాసం వెళ్లాడు. ఆ సమయానికి శివ పార్వతులు ఏకాంతంలో ఉంటారు. బయట కాపలా కాస్తున్న గణపతి పరశురాముడిని లోనికి వెళ్లకుండా అడ్డగించాడు. దీంతో పరశురాముడు ఆగ్రహిస్తాడు. ఈ దిక్కారంతో గణేషుడు తన తొండంతో పరశురాముడిని పైకెత్తిపడేస్తాడు. ఆగ్రహించిన పరశురాముడు తన చేతిలోని గొడ్డలిని గణపతిపైకి విసరగా ఒక దంతానికి తగిలి అది ఊడిపోతుంది. ఆ చప్పుడుకు ఉలికి పడిన పార్వతి, పరమేశ్వరులు బయటకు వచ్చి చూడగా నెత్తురుతో ఉన్న బాల గణపతి కనిపిస్తాడు. దీంతో ఆయనను ఎత్తుకొని పార్వతి పరశురాముడిని తీవ్రంగా మందలించింది. తన వల్ల కలిగిన అపరాదాన్ని మన్నించమని పరశురాముడు శివ, పార్వతులను వేడుకుంటాడు. ఒక దంతం పోగొట్టుకున్నందున ఆ నాటి నుంచి ఏకదంత గణపతిగా గణపతి పేరు పొందాడు.

Employee Voice

ఉద్యోగ వాయిస్

డీఎస్సీ వెంటనే ప్రకటించాలి

- టీయూటీఎఫ్ జిల్లా అద్యక్షుడు లింగంపెల్లి ప్రేంరావు



మందమర్రి : టీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడి మూడు సంవత్సరాలు కావస్తునేళ్ళా డీఎస్సీ ప్రకటించకపోవడం సరైంది కాదు. వెంటనే డీఎస్సీ ప్రకటించాలి. ఉమ్మడి సర్వీస్ రూల్స్ ప్రక్రియ చేపట్టి అమలు చేయాలి. సర్వీస్ రూల్స్ అమలులోకి వస్తేనే పదోన్నతులు లభిస్తాయి. కొన్ని సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్నఉపాధ్యాయ పోస్టులు కూడా భర్తీ అవుతాయి. చాలా మందికి జూనియర్ లెక్చరర్ ప్రమోషన్‌లు వస్తాయి. కొన్ని పాఠశాలల్లో మధ్యాహ్నా బోజన పథకం పకడ్బందీగా అమలు చేయడం లేదు. కొన్ని పాఠశాలల్లో ఇంకా దొడ్డు బియ్యం భోజనమే పెడుతున్నారు. మధ్యాహ్నా బోజన నిర్వాహకులకు సక్రమంగా బిల్లు రాకపోవడంతో వారు సైతం ఇబ్బందులు పడుతున్నారు. రేషనలైజేషన్ పేరుతో పది మంది విద్యార్దులు కూడా లేరనే సాకుతో పాఠశాలలను మూసివేసే విధానాన్ని మానుకోవాలి. తండాల్లో ఉన్న ఐటీడీఏ పాఠశాలలను కూడా తొలగిస్తున్నారు. పాఠశాలల తొలగింపునకు వ్యతిరేకంగా తమ సంఘం ఉద్యమాలకు ఏర్పాట్లు చేస్తుంది.

నీటి కుంటలో పడి ఇద్దరు మేకల కాపరుల మృతి



మృతదేహాల కోసం గాలిస్తున్న స్థానికులు

బోథ్: ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలంలోని టీవీటీ గ్రామ సమీప అడవుల్లోకి మేక లను మేపేందుకు వెళ్లిన ఇరు వురు చిన్నారులు స్నానం చేసేందుకు నీటికుంటలో దిగి మృత్యువాతపడ్డారు. వివరాలిలావున్నాయి. బుధవారం మధ్యాహ్నం టీవీటీ గ్రామ సమీప అడవుల్లో మేకలను మేపేందుకు సాకెర గ్రామానికి చెందిన జాదవ్‌రాజు (13), జాదవ్‌సాయి(13)లు వెళ్లారు. అయితే మధ్యాహ్నం పూట మేకలను ఒకచోటనుంచి స్నానం చేసేందుకు నీటి కుంటలోకి దిగారు. నీటి కుంటలో ఎక్కువ లోతుండడంతో మునిగిపోయారు. విషయాన్ని గమనించిన తోటి మేకల కాపరి జాదవ్ సురేందర్ కేకలు వేయగా, సమీప చేలలోని ప్రజలు కుంట వద్దకు చేరుకున్నారు. అప్పటికే చిన్నారులు నీటిలో మునిగి మృతి చెందారు. విషయం తెలుసుకున్న సాకెర గ్రామస్థులు అక్కడికి భారీ సం ఖ్యలో చేరుకుని, కుంటలో గాలించి, చిన్నారుల మృతదేహాలను ఒడ్డుకు చే ర్చారు. సమాచారం అందుకున్న బోథ్ ఎస్‌ఐ శ్రీనివాస్ సంఘటనా స్థలానికి చేరుకుని, శవపంచనామా అనంతరం పోస్టుమార్టం నిమిత్తం తరలించి, కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. కాగా, మృతిచెందిన పిల్లల తల్లిదండ్రు లు కూలీ చేసుకుంటూ జీవనం గడుపుతున్నారు. వీరి మృతితో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

చెరువులో పడి మహిళ మృతి

సారంగాపూర్: నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలం జామ్‌పెద్దూర్ గ్రామానికి చెందిన కర్పె వసంత (42) అనే మహిళ మృతిచెందినట్లు ఎస్‌ఐ రవీందర్ తెలిపారు. పోలీసులు, గ్రామస్థుల వివరాల మేరకు ఈమె గత కొన్ని రోజులుగా మతిస్థిమితం లేకుండా అనారోగ్యం బాధపడుతుండేది. మంగళవారం పంటచేనుకు వెళ్లి తిరిగి ఇంటికి తిరిగిరాలేదు. కుటుంబీకులు గ్రామ చుట్టుపక్కల వెతికినా ఆచూకీ తెలియలేదు. బుధవారం తెల్లవారుజామున పంట చేనువైపు వెళ్లిచూడగా, చెరువు గట్టుపై ఆమె చెప్పులు కనిపించడంతో పోలీసులకు సమాచారమందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని జాలర్ల సహాయంతో చెరువులో నుంచి మృతదేహాన్ని బయటకు తీయించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

జీవితంపై విరక్తి చెంది రైతు ఆత్మహత్య



మృతిచెందిన రైతు దత్తా కాంబ్లే

నార్నూర్: ఆదిలాబాద్ జిల్లా గాదిగూడ మండలం కొత్తపల్లి(జీ)కి చెందిన కాంబ్లే దత్తా(32) అనే రైతు పురుగుల మందు తాగి బుధవారం మృతిచెందాడు. గత కొన్నేళ్లుగా పంట దిగుబడి లేదని, ఈ ఏడాది కూడా పత్తి పంట సక్రమంగా పండదని మానసిక వేదనకు గురై పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడని కుటుంబసభ్యులు పేర్కొన్నారు. దత్తాకు మూడెకరాల వ్యవసాయ భూమి ఉండగా, అందులో పత్తి పంట ఉందని, బ్యాంకుల ద్వారా పంట రుణాలు ఇవ్వడం లేదని, పహానీ పత్రాలు కూడా దొరక్క తమ మనుగడ ఎలా సాధ్యమంటూ దిగాలు చెందేవాడని ఆవేదన వ్యక్తం చేస్తూ తెలిపారు. దత్తాకు భార్య శశికళ, ఒక కుమార్తె, ఒక కుమారుడు ఉన్నారు. ఏజెన్సీలోని ఎస్సీ రైతులకు భూపరమైన హక్కులు కల్పించాలని, మృతిచెందిన రైతు కుటుంబాన్ని ఆదుకోవాలని దళిత సంఘం నాయకుడు అనిల్ మోతే డిమాండ్ చేశారు. ఈ విషయంపై విచారణ జరుపుతున్నామని పోలీసులు తెలిపారు.

దయనీయం..గిరిజనుల జీవనం

- పౌష్టికాహారం లోపంతో రక్తహీనత
- పెరుగుతున్న బాలింతల మరణాలు
- ఫలితాలు ఇవ్వని సర్వేలు
- ఆదుకోని ప్రభుత్వ పథకాలు



అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు | రక్తలేమితో బాలింత

ఉట్నూర్: ఆదిలాబాద్ జిల్లాలోని గిరిజన ప్రాంతాల్లో రక్త హీనత కారణంగా బాలింతల మరణాలు సంభవిస్తున్నా అధికారుల చర్యలు నామ మాత్రమే అవుతున్నాయి. అధికారులు చేపట్టిన సర్వేలకు అనుగుణంగా చర్యలు తీసుకోవడంలో క్షేత్రస్థాయిలో విఫలమవుతున్నారు. ముఖ్యంగా గిరిజన ప్రాంతాల్లో పౌష్టికాహార లోపమే వీరిపట్ల శాపంగా మారి, ప్రతీయేటా పదుల సంఖ్యలో బాలికలు, గర్భిణులు, పిల్లలు మృతిచెందుతున్నారు. ఇప్పటివరకు ఉమ్మడి జిల్లాలోని ఏజెన్సీ గ్రామాల్లో ఎనిమిది మంది బాలింతలు, ఐదుగురు చిన్నారులు మృతిచెందినట్లు తెలుస్తుంది. గతంలో ఐటీడీఏ పీవోగా పని చేసిన శామ్యూల్ ఆనంద్‌కుమార్ గిరిజన ప్రాంతాల్లోని పీహెచ్‌సీల పరిధిలో రక్తలేమి, పౌష్టికాహార లోపమున్నవారిని గుర్తించాలని 150 హిమోగ్లోబిన్ మీటర్ల ను కొనుగోలు చేశారు. ఇరవై రోజులపాటు గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లల్లో రక్తహీనతను గుర్తించేందుకు వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు సర్వే నిర్వహించి, సుమారు ఇరవై వేలమంది రక్తహీనతతో బాధపడుతున్నట్లు గుర్తించారు. వారందరికీ పౌష్టికాహారం, ఐరన్ సిరఫ్ ఇవ్వాల్సివున్నా అధికారులు అందించలేకపోయారు. మాతా, శిశు మరణాలను నిరోధించేందుకు కృషిచేయాల్సివుండగా, అంతంత మాత్రంగానే అధికారులు కార్యక్రమాలు కానిస్తున్నారు. మలేరియా జ్వరాలు సోకినవారు ఎర్ర రక్తకణాలు తగ్గిపోవడంతో అనారోగ్యానికి గురై మరణిస్తున్నారు. అలాగే ఏజెన్సీలోని గిరిజన మహిళలు ప్రసవ సమయంలో రక్తహీనతకు గురై మరణిస్తున్నారు. ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతాల్లో పలు వ్యాధులతో బాధపడుతున్న గిరిజన మహిళలకు పరీక్షలు జరిపేందుకు గిరిజన గైనాకాలజిస్టులు అందుబాటులో లేరు. ఇటీవల ఉట్నూర్ మండలం దొంగచింతలో పెందూర్ సోంబాయి అనే బాలింత మృతిచెందగా, ఇంద్రవెల్లి మండలంలోని ఓల్‌మాద్రిలో రాధాబాయి అనే మహిళ ప్రసవ సమయంలోనే మృతి చెందింది. ఇదే మాదిరి బీర్సాయిపేట, నార్నూర్, మార్లవాయి, గాదిగూడ, పిట్టబొంగరం, దబోలిలో ఎనిమిదిమంది బాలింతలు మృత్యువాతపడ్డారు. ఇటీవల ఉట్నూర్ మండలంలోని రాంజీగూడలో రాహుల్ (10) అనే విద్యార్థి రక్తహీనతతో మృతి చెందగా, ఇప్పటివరకు ఏజెన్సీలో ఐదుగురు ఇదే వ్యాధితో మృతిచెందినట్లు తెలుస్తుంది.

ఐసీడీఎస్‌లో అమలుకాని పౌష్టికాహార పథకం

జిల్లాలోని గిరిజన ప్రాంతాల బాలింతలు, గర్భిణిలు, చిన్నారులకు పౌష్టికాహారం అందించాలని ఏర్పాటుచేసిన అంగన్‌వాడీ కేంద్రాలు అలంకార ప్రాయమవుతున్నాయి. అంగన్‌వాడీ కేంద్రాల్లో బాలింతలు, గర్భిణులకు అందించాల్సిన పౌష్టికాహార సరకులు నామమాత్రంగా సరఫరా అవుతున్నాయి. అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ అస్తవ్యస్తంగా కనిపిస్తుంది. అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా కావాల్సిన కోడిగుడ్లు, పాలు, నూనె, బియ్యం సక్రమంగా సరఫరా కావడం లేదు. ఆకుకూరలు, కూరగాయలు, పాలు, బాలామృతం అందించాల్సివున్నా సక్రమంగా అమలు కావడం లేదు. ఆరోగ్యలక్ష్మి పథకం అంతంత మాత్రంగానే అమలవుతున్నా, పర్యవేక్షణ కొరవడింది. జిల్లాలోని 18 మండలాల్లో ఐదు ఐసీడీఎస్ ప్రాజెక్టులుండగా, 1,256 అంగన్‌వాడీ కేంద్రాలు పనిచేస్తున్నాయి. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే బాలికలు, గర్భిణిలు, పిల్లలకు భోజనం వండిపెట్టాల్సివున్నా గత వేసవిలో ఎక్కడా బియ్యం సరఫరా లేక ఈ పథకం అమలు కాలేదు. గుడ్ల సరఫరాలో సైతం అక్రమాలు చోటుచేసుకుంటున్నాయి. ఆన్‌లైన్ విధానంలో గుడ్లు సరఫరా చేస్తున్నామంటూ పేర్కొంటున్నా అక్రమాలు జరుగుతూనే ఉన్నాయి. అంగన్‌వాడీ కేంద్రాలపై పర్యవేక్షణ లోపించేందుకు అధికంగా సెంటర్లుండడం, పర్యవేక్షణ సిబ్బంది అంతంత మాత్రంగానే ఉండడమే కారణమంటున్నారు.

డయేరియాతో బాలిక మృతి



బాలిక మృతదేహం

ఇంద్రవెల్లి: మండలంలోని దస్నాపూర్ గ్రామ పంచాయతీ ధర్మగూడకు చెందిన మడావి శ్రీదేవి (16) వాంతులు, విరేచనాలతో బుధవారం తెల్లవారు జామున మృతిచెందింది. కుటుంబీకులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం శ్రీదేవికి మంగళవారం రాత్రి పన్నెండు గంటల సమయంలో వాంతులు, విరేచనాలు కావడంతో, చికిత్స నిమిత్తం ఎడ్లబండిపై రెండు కిలోమీటర్ల దూరంలోని పిట్టబొంగరం తరలించారు. అక్కడ వైద్యులు ఎవరూ లేకపోవడంతో ఆటోలో ముత్నూర్‌కు తీసుకువెళ్లి 108లో రిమ్స్‌కు తరలించే ప్రయత్నంలో ఉండగానే మృతిచెందిందన్నారు.

అంగన్‌వాడీలో అమలు కాని పౌష్టికాహారం



గర్భిణులు, బాలింతలకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం సక్రమంగా అందడం లేదు. పలు కార్యాలయాల్లో సిబ్బంది సరిగ్గా విధులు నిర్వహించకపోగా కొన్నింటిలో టీచర్లు సక్రమంగా విధులు నిర్వహించడం లేదు. ప్రభుత్వ ఆశయం బాగానే ఉన్నా, అమలులో సిబ్బంది విఫలమవుతున్నారు.

- కస్తాల ప్రేమల, రీజనల్ అర్గనైజర్, మహిళా, శిశు సంక్షేమ శాఖ

ఫుడ్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలో ఏసీబీ దాడులు

- రికార్డులు తనిఖీ.. స్వాధీనం





వివరాలు వెల్లడిస్తున్న ఏసీబీ డీఎస్పీ, స్వాధీనం చేసుకున్న దస్త్రాలు

ఆదిలాబాద్ టౌన్: ఆదాయానికి మించి ఆస్తులున్నాయన్న ఆరోపణలపై ఆదిలాబాద్ జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ బాపూజీ కార్యాలయంలో ఏసీబీ అధికారులు బుధవారం దాడులు నిర్వహించారు. ఉదయం ఎనిమిది నుంచి పది గంటల వరకు నిర్వహించిన సుదీర్ఘ తనిఖీలో కార్యాలయంలోని రికార్డులను పరిశీలించి స్వాధీనం చేసుకున్నారు. అటు వరంగల్, కరీంనగర్ జిల్లాలకు కూడా ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నందున ఆ జిల్లాలోని ఫుడ్‌ఇన్‌స్పెక్టర్ కార్యాలయాల్లో తనిఖీలు నిర్వహించిన ఏసీబీ అధికారులు రికార్డులను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కరీంనగర్, వరంగల్, ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలో జరిగిన ఈ సోదాలో అనేక రికార్డులను స్వాధీనం చేసుకుని బాపూజీని అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆదిలాబాద్ ఏసీబీ డీఎస్పీ పాపాలాల్ మాట్లాడుతూ, ఆదాయానికి మించి ఆస్తులున్నాయనే సమాచారం మేరకు తాము ఈ మూడు జిల్లాల్లో తనిఖీలు నిర్వహించామన్నారు. బాపూజీని అదుపులోకి తీసుకుని హైదరాబాద్‌కు తరలిస్తున్నామన్నారు. సీఐ కాశయ్య, హెడ్ కానిస్టేబుల్ పోశెట్టి తదితరులు దాడుల్లో పాల్గొన్నారు.

'గణేష్ ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేలా చూడాలి'



మాట్లాడుతున్న డీఐజీ రవివర్మ

ఆదిలాబాద్ టౌన్: గణేష్ నవరాత్రి ఉత్సవాలు జిల్లాలో ప్రశాంత వాతావరణంలో జరిగేలా చర్యలు తీసుకోవాలని కరీంనగర్ పోలీసు రేంజ్ డీఐజీ రవివర్మ అధికారులను ఆదేశించారు. జిల్లా పర్యటనకు వచ్చిన డీఐజీకి ఎస్పీ ఎం.శ్రీనివాస్ పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల పోలీసు అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ, గణేష్ ఉత్సవాల్లో బందోబస్తు ప్రణాళికలను సిద్ధం చేసినట్లు డీఐజీకి వివరించారు. ఈ సందర్భంగా డీఐజీ మాట్లాడుతూ, రాష్ట్రంలోనే ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాలు అతి కీలకమైన ప్రదేశాలని, రాష్ట్ర స్థాయి పోలీసు అధికారులు ఈ రెండు జిల్లాలపై ప్రత్యేక దృష్టిసారించారన్నారు. బందోబస్తు పరంగా ఎటువంటి లోటుపాట్లు లేకుండా చూడాలన్నారు. ఎస్పీ స్వయంగా బందోబస్తు బాధ్యతలను పర్యవేక్షించాలన్నారు. డీఎస్పీలు రాత్రి సమయంలో పెట్రోలింగ్‌లో పాల్గొనాలన్నారు. ప్రత్యేక పోలీసు కంట్రోల్ రూంను ఏర్పాటు చేసి 24గంటలు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. శాంతి కమిటీ, గణేష్ నిర్వహణ కమిటీ సభ్యులతో సమావేశమై పోలీసు నిబంధనలు తెలపాలన్నారు. ఆదిలాబాద్ డీఎస్పీలు ఏ.లక్ష్మీనారాయణ, వీ.చంద్రప్రభు, కే.సీతారాములు, నిర్మల్ డీఎస్పీ కే.మనోహర్‌రెడ్డి, గ్రామీణ సీఐ ఎల్.జీవన్‌రెడ్డి, పట్టణ సీఐలు వీపూరి సురేష్, టీ.స్వామి, గ్రామీణ సీఐలు కే.పురుషోత్తం, పోతారం శ్రీనివాస్, ఎస్.సతీష్‌కుమార్, స్పెషల్ బ్రాంచ్ ఎస్‌ఐ అన్వర్‌ఉల్‌హక్, ఎస్‌ఐలు ఎల్.రాజు, సుబ్బారావు, డీ.మోహన్, ట్రాఫిక్ ఎస్‌ఐ బీ.వెంకటేష్ పాల్గొన్నారు.

26న అండర్-17 వాలీబాల్ ఎంపిక పోటీలు

నిర్మల్ స్పోర్ట్స్: నిర్మల్ జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 26న వాలీబాల్ అండర్ - 17 ఎంపిక పోటీలను నిర్వహిస్తున్నట్లు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి నఫేఖాన్ తెలిపారు. ఈ ఎంపికలను సారంగాపూర్ మండలంలోని బీరవెల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్నామన్నారు. అర్హులైన విద్యార్థులు ఆధార్, పుట్టిన ధ్రువీకరణ పత్రం, బోనఫైడ్ పత్రాలతో హాజరుకావాలని సూచించారు.

'తప్పుడు పనులతో భవిష్యత్తు అంధకారం'



అవగాహన కల్పిస్తున్న సీఐ జాన్ దివాకర్

నిర్మల్ కల్చరల్: యువకులు తప్పుడు పనులకు పాల్పడితే భవిష్యత్తు అంధకారంగా మారుతుందని నిర్మల్ పట్టణ సీఐ జాన్ దివాకర్ అన్నారు. అక్రమ మార్గంలో నడిచే యువతకు స్థానిక పోలీస్ స్టేషన్‌లో కౌన్సెలింగ్ నిర్వహించారు. చట్టం పట్ల గౌరవం ఉండాలని, న్యాయంగా వ్యవహరించాలని వారికి సూచించారు. అసాంఘిక కార్యకలాపాల్లో పాలుపంచుకుంటే బంగారు భవిష్యత్తు నాశనమవుతుందని, తల్లిదండ్రులు, సమాజానికి బాధ కలిగే విధంగా వ్యవహరించరాదన్నారు. ఆవేశాలకు పోయి, అక్రమాలకు పాల్పడి కేసుల్లో ఇరుక్కోవద్దని సూచించారు. పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్ది, వారిని పర్యవేక్షించే బాధ్యత తల్లిదండ్రులదేనన్నారు. ఈ సందర్భంగా ఎండీ సలీమ్, మజాహర్, ముద్దసర్, ఫహీం అనే నలుగురు యువకులను బైండోవర్ చేసినట్లు సీఐ వివరించారు. ఈ సమావేశంలో టౌన్ ఎస్ఐ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

'పునరుజ్జీవ పథకంతో జిల్లా సస్యశ్యామలం'

నిర్మల్ కల్చరల్: ఎస్సారెస్పీ పునరుజ్జీవ పథకం ద్వారా శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో నీరు రివర్స్ పంపింగ్‌తో నిర్మల్ జిల్లాతోపాటు ఆదిలాబాద్, కరీంనగర్, జగిత్యాల్, నిజామాబాద్, వరంగల్ జిల్లాలు సస్యశ్యామలమవుతాయని రాష్ట్ర గృహనిర్మాణ, దేవాదాయ, న్యాయశాఖల మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. నిర్మల్ దివ్య గార్డెన్‌లో బుధవారం ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడుతూ, డిస్ట్రిబ్యూటరీ 27, 28 సరస్వతీ కెనాల్ ద్వారా జిల్లా ప్రజలకు నీటి సౌకర్యం కలుగుతుందన్నారు. కాళేశ్వరంపై ప్రాజెక్టు నిర్మాణమైతే తెలంగాణలోని జిల్లాలకు సాగునీటికి ఢోకా ఉండదన్నారు. కాళేశ్వరం నుంచి ప్రాజెక్టుతోపాటు శ్రీరాంసాగర్ ప్రాజెక్టు పునరుజ్జీవ పథకం నిర్మాణం కోసం నీటి పారుదల, పర్యావరణ శాఖల ఆధ్వర్యంలో ప్రజాభిప్రాయ సేకరణ జరుగుతుందని, ఈ మేరకు గురువారం నిర్మల్ జిల్లాకు కమిటీ రానున్నట్లు తెలిపారు. రైతులు ఈ సందర్భంగా ప్రజాభిప్రాయ సేకరణలో తమ అభిప్రాయాలు వెల్లడించవచ్చన్నారు. ఈ సమావేశంలో ముథోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి, ఏఎంసీ చైర్మన్ దేవేందర్‌రెడ్డి, టీఆర్ఎస్ నాయకులు రవీందర్‌రావు, హరీష్‌రావు తదితరులు పాల్గొన్నారు. నిర్మల్ జిల్లాకు చెందిన జెడ్పీటీసీ, ఎంపీటీసీ, ఎంపీపీ, సర్పంచ్ తదితరులు ఈ సమావేశానికి హాజరయ్యారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి

సీఎం రిలీఫ్ చెక్కులు అందించిన మంత్రి

నిర్మల్ స్పోర్ట్స్: ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కును బుధవారం మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి లబ్ధిదారులకు అందించారు. బంగల్‌పేట్‌కు చెందిన శారద, ఆదర్శనగర్‌కు చెందిన నర్స వ్వ, కడ్తాల్‌కు చెందిన మల్లవ్వ, చింతల్‌చాందకు చెందిన సతీష్‌లకు చెక్కులను అందజేశారు.

అదనపు సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

నిర్మల్ స్పోర్ట్స్: జామ్‌లోని బాలుర మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలో 5, 6, 7 తరగతుల్లో ఆదనంగా 120మంది విద్యార్థుల ప్రవేశానికి ఆఫ్‌లైన్ పద్ధతిలో దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి ప్రేంకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన విద్యార్థులు తమ టీసీ, బోనఫైడ్ సర్టిఫికేట్ జిరాక్స్‌లతో దరఖాస్తులను 31 ఆగస్టు, 2017లోగా బాలుర మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాల, ప్రియదర్శిని నగర్, నిర్మల్, ప్రిన్సిపాల్ కార్యాలయంలో సమర్పించాలని ఆయన ప్రకటనలో తెలిపారు.

31 డిసెంబర్‌లోగా

ఎంప్లాయ్‌మెంట్ కార్డ్ రెన్యువల్ చేసుకోండి


● జిల్లా ఉపాధి కల్పన అధికారి గఫర్

నిర్మల్ టౌన్: ఎంప్లాయ్‌మెంట్ కార్డును 1 జనవరి, 2000 నుంచి జూలై, 2017 మధ్య రెన్యువల్ చేసుకోనివారు 31 డిసెంబరు, 2017లోగా జిల్లా ఉపాధి కల్పన కార్యాలయం, ఆదిలాబాద్, నిర్మల్ ఉప ఉపాధి కార్యాలయం, బెల్లంపల్లి, ఉట్నూర్‌లలో తమ ఒరిజినల్ ఎంప్లాయ్‌మెంట్ కార్డును పోస్ట్ ద్వారాగానీ, స్వయంగా కార్యాలయానికి వచ్చిగానీ రెన్యువల్ చేసుకునేందుకు సంప్రదించాలని జిల్లా ఉపాధి కల్పన అధికారి ఎం.ఏ గఫార్ ఒక ప్రకటనలో తెలిపారు.

పాఠశాలను తనిఖీ చేసిన డీఈవో

నర్సాపూర్ (జి): నర్సాపూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలను బుధవారం డీఈవో ప్రణీత ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆరో తరగతి నుంచి తొమ్మిదో తరగతి వరకు విద్యనభ్యసించే విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న అభ్యసనాభివృద్ధి కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు రాయడం, చదవడం, కనీస గణిత ప్రక్రియలు చేయడం గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం డీఈవో తొమ్మిదో తరగతి విద్యార్థులకు సాంఘిక శాస్త్రం బోధించారు. ఈ కార్యక్రమంలో సెక్టోరల్ అధికారి కరుణ, సలోమి, సైన్స్ అధికారి వినోద్‌కుమార్, హెడ్‌మాస్టర్ మోడపు రాజేశ్వర్ తదితరులున్నారు.

సినిమా గైడ్ నిర్మల్



తిరుమల: నేనే రాజు నేనే మంత్రి
వేంకటేశ్: జయ జానకి నాయకా
నారాయణ: ఫిదా

ఇంటింటికీ సామాజిక చైతన్య యాత్ర

నిర్మల్ కల్చరల్: సామాజిక చైతన్యంతోనే బడుగు, బలహీన వర్గాల్లో వెలుగులు విరజిమ్ముతాయని ఆకాంక్షిస్తూ జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బుధవారం చైతన్య యాత్రకు శ్రీకారం చుట్టింది. కన్వీనర్ డాక్టర్ కృష్ణంరాజు నేతృత్వంలో 24వ వార్డులో ఇంటింటికీ పాదయాత్ర చేస్తూ సబ్బండ కులాలకు చెందిన ప్రజలకు కరపత్రాలు అందించారు. ఐక్యంతో ముందుకుపోవాలని పిలుపునిచ్చారు. అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తేనే రాజకీయ చైతన్యం సాధ్యమవుతుందన్నారు. ఆర్.కృష్ణయ్య నాయకత్వంలో నాలుగు దశాబ్దాలుగా ఉద్యమాలు కొనసాగిస్తున్నామని, రానున్న రోజుల్లో బీసీ హక్కుల సాధనకు కలిసి రావాలన్నారు. సభ్యత్వ నమోదు చేయించుకుని, సంఘ బలాన్ని చాటాలన్నారు. జిల్లా నాయకులు వెంకట్ వర్మ, జీవన్, ఎంబడి చంద్రశేఖర్, గంగాధర్ షిండే, నర్సింహులు, ప్రభాకర్, భీమన్న తదితరులున్నారు.

బామ్ని తండాలో ఘనంగా తీజ్ ఉత్సవాలు

నర్సాపూర్ (జి): లంబాడీల సాంప్రదాయ పండుగైన తీజ్‌ను బుధవారం మండలంలోని నందన్ తాండ గ్రామంలో ఘనంగా నిర్వహించారు. ఈ పండుగకు ముఖ్య అతిథిగా నర్సాపూర్ ఎస్ఐ రాంనర్సింహారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మన సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడుకుని పండుగలను నిర్వహించుకోవడం చాలా అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా మహిళలు, యువకులు చేసిన సాంప్రదాయ నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. తొమ్మిది రోజులుగా వివాహం కాని అమ్మాయిలు వెదురు బుట్టలతో పుట్టమన్ను తెచ్చి, అందులో గోధుమ గింజలు చల్లి పవిత్రంగా పూజించి సుఖ సంతోషాలతో ఉండాలని కోరుతూ, ఆట పాటలతో ఊరేగింపుగా వెళ్లి తీజ్‌ను నిమజ్జనం చేశారు. అనంతరం ఎస్ఐ రాంనర్సింహారెడ్డిని సర్పంచ్ దత్తురాం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రమేష్, మోహన్, పరమేష్, రవి, రాజేందర్, విలాస్, విజేష్, నరేందర్ తదితరులున్నారు.

ఉచిత కంటి వైద్యశిబిరం

సోన్: మండల కేంద్రంలోని చత్రపతి శివాజీ సేవా సమితి ఆధ్వర్యంలో బుధవారం ఉచిత కంటి వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో వివిధ గ్రామాల నుంచి హాజరైన ప్రజలకు కంటి వైద్యపరీక్షలు నిర్వహించారు. డాక్టర్ నవీన్ నురాని, శెట్టిపల్లి శివలు వైద్య చికిత్సలు అందించారు. సర్పంచ్ కృష్ణప్రసాద్‌రెడ్డి, ఉప సర్పంచ్ నరేష్, మాజీ ఎస్‌యంసి చైర్మన్ పత్తి రాజు, నాయకులు మురళీధర్‌రెడ్డి, ఫైమద్ ఖాన్, బిట్లింగ్ నరేష్, అన్వేష్ పాల్గొన్నారు.

కదిలి ఆలయ హుండీ లెక్కింపు

దిలావర్‌పూర్: మండలంలోని శ్రీ మాతాన్నపూర్ణ కదిలి పాపహరేశ్వరాలయం హుండీని బుధవారం లెక్కించారు. శ్రావణ మాసానికి సంబంధించి రూ.3.43 లక్షల నగదు ఆదాయం లభించింది. గతేడాదికంటే రూ.80 వేలు అదనంగా వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి టీ.నారాయణ తెలిపారు. దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ రవికిషన్‌గౌడ్, ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు భూమేష్, పంచాక్షరి ఉన్నారు.

'ప్రతి మహిళా ఆర్థిక స్వావలంబన సాధించాలి'

దిలావర్‌పూర్: రుణాలను సద్వినియోగం చేసుకోవడం ద్వారా ప్రతి మహిళా ఆర్థిక స్వావలంబన సాధించాలని ఐకేపీ ఏపీఎం విజయలక్ష్మి అన్నారు. చైతన్య మండల సమాఖ్య సర్వసభ్య సమావేశం బుధవారం స్త్రీ శక్తి భవనంలో నిర్వహించారు. మండల సమాఖ్య ద్వారా అందించిన రుణాలను సద్వినియోగం చేసుకుంటూ అనేక మంది మహిళలు స్వయం ఉపాధి పొందుతున్నారని చెప్పారు. మరింత మంది మహిళలు స్వయం ఉపాధి కోసం అవసరమైన రుణాలను మండల సమాఖ్య ద్వారా అందించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. 2016-17 ఆర్థిక సంవత్సరంలో మహిళా సంఘాలకు రూ. 18లక్షలను రుణాల కింద అందజేయగా, మండల సమాఖ్యకు రూ.2 లక్షలు 50వేలు లాభం చేకూరిందన్నారు. గ్రామసంఘాలను బలోపేతం చేసేందుకు అవసరమైన ప్రణాళికలతో ముందుకువెళ్తున్నామన్నారు. ప్రతి మహిళా ఆర్థికంగా ఎదిగినప్పుడే సమాజంలో గుర్తింపు, గౌరవం లభిస్తుందన్నారు. మండలంలో మహిళా సంఘాల్లో చేరకుండా ఉన్న 67 మంది మహిళలను సంఘాల్లో చేరేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో ఆయా గ్రామాల సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు, ఐకేపీ సీసీలు ముత్యం, పోశెట్టి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



మండల సమాఖ్య సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

మండల సమాఖ్య నూతన కార్యవర్గం ఎన్నిక

దిలావర్‌పూర్ మండల సమాఖ్య నూతన కార్యవర్గాన్ని బుధవారం జరిగిన మండల సమాఖ్య సర్వసభ్య సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా రాజుల లక్ష్మి (దిలావర్‌పూర్), ఉపాధ్యక్షురాలిగా కవిత (మయాపూర్), ప్రధాన కార్యదర్శిగా మహేంద్ర (గుండంపల్లి), సహాయ కార్యదర్శిగా సరిత (దిలావర్‌పూర్) కోశాధికారిగా రాణి (సాంగ్వి)లు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఏపీఎం విజయలక్ష్మి ప్రకటించారు.

కాలుష్య నివారణపై కళాజాతా ప్రదర్శనలు

ఆదిలాబాద్‌టౌన్: రైల్వే స్టేషన్, బస్టాండ్, రైతు బజార్ ప్రాంతాలలో తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణ పై బుధవారం కళాజాత ప్రదర్శనలు చేశారు. ఇందుకు స్థానికంగా ఉన్న ప్రజలు మంత్రముగ్ధులై పర్యావరణాన్ని కాలుష్యం కాకుండా ఉండేందుకు ప్రతి ఒక్కరు చూడాల్సిన బాధ్యత అని చెప్పుకున్నారు. పర్యావరణం కాలుష్యం కావడం వల్ల జరిగే అనర్థాలను, వాటి పరిణామాలను వివరిస్తూ కళాజాత బృందం చేసిన ప్రదర్శనలు అందరినీ పరవశింపచేశాయి. ఈ కార్యక్రమంలో కళాకారులు పాల్గొన్నారు.

45కు చేరిన గిరిజనుల మేకలు మృతి

సిరికొండ: మండలం రిమ్మ గ్రామానికి చెందిన 8 మంది ఆదివాసీ గిరిజన రైతులకు చెందిన మేకల మృతి సంఖ్య 45కు చేరుకుంది. రిమ్మ పరిసర ప్రాంతమైన దట్టమైన అడవిలో సంద్ర చెట్టుకు చెందిన ఆకుతిని మంగళవారం సాయంత్రం అడవిలోనే అక్కడక్కడ పడిపోయి 40 మేకలు మృతి చెందిన విషయం విధితమే. సంద్ర ఆకుతిని పడిపోయిన కొన్ని మేకలను ఇతర చెట్ల రసాలు తాగించి కొన్నింటిని రక్షించుకోగా, పశువైద్య సిబ్బంది మరికొన్ని కొన్ని మేకలకు చికిత్సలు జరిపి కాపాడారు. అయినప్పటికీ రాత్రి మరో ఐదు మేకలు మృత్యువాత పడ్డాయి. మేస్రం సాక్కు బాయికి చెందిన 22 మేకలు, సిడాం దేవురావుకు చెందినవి 10, పెందూర్ మారిలి, పెందూర్ మంతు, మహదు, బండులకు చెందిన రెండేసి చొప్పున సిడాం సీతారాంకు చెం దిన 3 మేకలు మృత్యువాత పడ్డాయి. దాదాపు రూ.3 లక్షల ఆస్థి నష్టం వాటిల్లినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ చనిపోయిన మేకలన్ని గతంలో డ్రోక్రా రుణాల క్రింద తీసుకున్నవే. ప్రభుత్వం నష్ట పరిహారం ఇచ్చి ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

ఆంధ్రజ్యోతి నవ్య కథల పోటీలో జిల్లా వాసికి బహుమతి

ఆదిలాబాద్ టౌన్: ఆంధ్రజ్యోతి అనుబంధ నవ్య సంచిక కథల పోటీలో జిల్లా కేంద్రానికి చెందిన ప్రముఖ కథ రచయిత బి.మురళీధర్‌కు ప్రత్యేక బహుమతి లభించింది. మురళీధర్ రాసిన వారసుడనే కథకు ఈ బహుమతి లభించింది. ఆంధ్రజ్యోతి దినపత్రిక నవ్య సంచిక వారు నగదు బహుమతి రూ.5వేలను అందించినందుకు మురళీధర్ సంతృప్తి వ్యక్తం చేశారు.

ప్రపంచ ఫొటోగ్రఫీలో జిల్లా వాసికి ప్రథమ బహుమతి

ఆదిలాబాద్ టౌన్: ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్ గర్మిల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫొటోగ్రఫీ పోటీల్లో జిల్లాకు చెందిన ఫొటోగ్రాఫర్ వెల్పుల సుధీర్‌కు జనరల్ విభాగంలో ప్రథమ బహుమతి లభించింది. బుధవారం విజేతలకు లయన్స్ క్లబ్ ఆఫ్ గర్మిల శాఖ చైర్మన్ ఒల్లాల సత్తయ్య ఆధ్వర్యంలో మచిర్యాల జిల్లా కేంద్రంలోని వివేకవర్ధిని డిగ్రీ కళాశాలలో అంతర్ జాతీయ ఫొటోగ్రాఫర్ సంపత్‌కుమార్ చేతుల మీదుగా బహుమతుల ప్రధానోత్సవ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా అంతర్జాతీయ ఫొటోగ్రాఫర్ సంపత్‌కుమార్ వెల్పుల సుధీర్‌ను లయన్స్ క్లబ్ గర్మిళ్ల శాఖ చైర్మన్ ప్రత్యేకంగా పూలమాల, శా లువాతో సన్మానించి అభినందించారు.

పత్తి పంటకు విల్ట్ వ్యాధి: ఆందోళనలో రైతులు

సిరికొండ: పత్తి పంటకు విల్ట్ వ్యాధి సోకడంతో రైతులు ఆందోళన చేస్తున్నారు. గత మూడు, నాలుగు రోజులుగా కురిసిన వర్షాలకు పత్తి పంటకు విల్ట్ వ్యాధి సోకుతూ నిటారుగా పత్తి వాడి పోతుంది. సాధారంగా అధిక వర్షాలు కురిస్తే నీరు పట్టి పంటలు ఎండి పోతాయి. ఇటీవల కురుస్తున్న వర్షాల వల్ల పంటలు ఏ మాత్రం నీరు పట్టక పోయినప్పటికీ కొత్త రకమైన విల్ట్‌వ్యాధి సోకడంతో పత్తి పంట నిటారుగా ఎండి పోతుంది. దీంతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో వాయిపేట్, కొండాపూర్, రిమ్మలక్ష్మిపూర్, నేరడిగొండ(జి) గ్రామాల్లో కూడా పత్తి పంటకు విల్ట్ వ్యాధి సోకి పంట వాడి పోతున్నట్లు రైతులు తెలిపారు. వ్యవసాయాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

పంటలను పరిశీలించిన అధికారులు

తాంసి: భీంపూర్ మండల కేంద్రంలో బుధవారం వ్యవసాయ శాఖ అధికారులు తెగుళ్ల సోకిన పంటలను పరిశీలించారు. మండలంలోని నిపాని, వడ్గావ్, వడూర్, గోన, ధనోర గ్రామాలలో కూడా వారు పర్యటించి తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు. ఏఈవో గురురాజ్, నవీన్, ప్రమోద్, జహుర్, లస్మన్నలున్నారు.

హరితహారంలో ప్రతీ ఒక్కరు భాగస్వాములు కావాలి

● **మున్సిపల్ చైర్ పర్సన్ మనీషా**

ఆదిలాబాద్ టౌన్: జిల్లాలో చేపట్టిన తెలంగాణకు హరితహారం కార్యక్రమాన్ని లక్ష్యం దిశగా తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని అందులో విద్యార్థులే కీలక పాత్ర పోషించాలని మున్సిపల్ చైర్ పర్సన్ రంగినేని మనీషా అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో చేపట్టిన హరితహారం కార్యక్రమంలో భాగంగా ఎల్ఎన్‌టీ ఆధ్వర్యంలో హరితహారం కార్యక్రమం నిర్వహించి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హరితహారం నిర్వహించడం వల్ల రాష్ట్రంలో పచ్చదనం పెరిగి హరిత ఆదిలాబాద్‌గా తీర్చిదిద్దబడుతుద న్నారు. దీంతో అడవుల జిల్లాగా పేరున్న ఆదిలాబాద్ జిల్లాలో తగ్గిన అటవీ సంపద మరింత పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్యంగా విద్యార్థులు భాగస్వాములు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



మొక్క నాటి నీళ్లు పోస్తున్న దృశ్యం

నాటడమే కాదు మొక్కలను సంరక్షించాలి: జేసీ కృష్ణారెడ్డి

మొక్కలను నాటడమే కాకుండా వాటిని సంరక్షించే బాధ్యతను ప్రతి ఒక్కరు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ కృష్ణారెడ్డి అన్నారు. బుధవారం రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో బట్టి సావర్గావ పంచాయతీలోని కేజీబీవీ పాఠశాల ఎదుట హరితహారం కార్యక్రమాన్ని నిర్వహించారు. జేసీ, రామకృష్ణ సేవా సమితి సభ్యులతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ హరితహారం కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరు భాగస్వాములై మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ సే వా సమితి సభ్యులు కోరెడ్డిలెనిన్, న్యాయవాది వెండి భద్రిశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

బడుగుబలహీన వర్గాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

● **బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు**

బజార్‌హత్నూర్: బడుగుబలహీన వర్గాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని బోథ్ ఎమ్మెల్యే రా థోడ్ బాపురావు అన్నారు. బుధవారం మండలం లోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ పథకంలో భాగంగా మండలానికి చెందిన 40మంది లబ్ధిదా రుల లో ఆరుగురికి రూ.51వేల చెక్కులను, 34 మందికి రూ.75వేలు చెక్కులను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ బడుగుబల హీన వర్గాల ప్రజలకు అండగా ఉండేందుకు కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ పథకాలను ప్రవేశ పెట్టారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సోమరాంరెడ్డి, ఎంపీడీవో రామకృష్ణారావు, తహసీల్దార్ రాజేందర్ సింగ్, సహకార సంఘం చైర్మన్ తు రాటి భోజన్న, సర్పంచ్‌లు పర్చ సాయన్న, విద్యాసాగర్, ఎంపీటీసీలు తేలి నారాయణ, ఐకేపీ ఏపీవో గణేష్, టీఆర్ఎస్ మండల కన్వీనర్ నానం రమణ, ఆల్కే గణేష్, సీహెచ్ భూమన్న, లక్కం రాములు, కొత్త శంకర్, కానిందే రాజారాం, జగ దీష్‌లు పాల్గొన్నారు.

బోథ్‌లో..

బోథ్: మండలంలోని ఘన్‌పూర్ గ్రామంలో అన్నబావుసాఠే 97వ జయంతిని బుధవారం పురస్కరించుకొని ఏర్పాటు చేసిన కార్యక్రమలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు ప్రసంగించారు. ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, టీ ఆర్ ఎస్ నాయకులు కుడాల స్వామి, సర్పంచ్ శ కుంతలగులాబ్‌సింగ్, డా.బీవీదాస్, మాజీ బీసీ సీ డీ చైర్మన్ కాంబ్లె నాందేవ్, గ్రామ పటేల్ భగవ న్‌దాస్, పాండువాగ్మారే, టీఆర్ఎస్ మండల పార్టీ కన్వీనర్ రుక్మన్‌సింగ్, సోనాల ఎంపీటీసీ రాయల్‌సింగ్, జీవి రమణ గౌడ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్, జాగృతి కన్వీనర్ విష్ణుకుమార్, బోథ్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ వినోద్‌ముండేలున్నారు.



ఘన్‌పూర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

రైతుల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

● **టీడీడీసీ చైర్మన్ లోకభూమారెడ్డి**

ఆదిలాబాద్‌టౌన్: గత ప్రభుత్వాల పాలనలో రైతులు సరైన ఆదరణకు నోచుకోలేక పోయారని కానీ తెలంగాణ రాష్ట్రంలో వారి ఆర్థికాభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం కృషి చేస్తుందని టీడీడీసీ చైర్మన్ లోకభూమారెడ్డి అన్నారు. బుధవారం డీసీఎంఎస్ చైర్మన్ కార్యాలయంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా సహకార శాఖ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. డీసీఎంఎస్ ఉమ్మడి జిల్లా చైర్మన్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో భాగంగా లోకభూమారెడ్డిని పూలమాల శాలువాతో ఘనంగా పాలకవర్గ సభ్యులు సన్మానించారు. అనంతరం లోకభూమారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో గత ప్రభుత్వాలు పాడి రైతులను పట్టించుకోలేదన్నారు. నేడు జిల్లా కేంద్రంలో పాల శీతలీకరణ కేంద్రానికి 500 లీటర్ల వరకు రాష్ట్ర వ్యాప్తంగా 2లక్షల 50వేల లీటర్లు ఉంటే 5లక్షల లీటర్లకు పెంచడం జరిగిందన్నారు. అంతకు ముందు డీసీఎంఎస్ ఉమ్మడి జిల్లా చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గత ప్రభుత్వాలు చేయని విధంగా ఎన్నో సంక్షేమ పథకాలను రై తులకు ప్రవేశ పెడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డీసీ ఎంఎస్ వైస్ చైర్మన్ దేవన్న, డైరెక్టర్లు కోటేష్, టీఆర్ఎస్ రైతు సంఘం అధ్యక్షుడు బాలూరి గోవర్ధన్‌రెడ్డి, ఇతర చైర్మన్లు, తదితరులు పాల్గొన్నారు.

'రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించాలి'

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కార్ఫ్‌బాల్ జట్లకు ఎంపికైన క్రీడాకారులు బాగా సాధన చేసి రాష్ట్ర స్థాయి పోటీల్లో విజయం సాధించేలా కృషి చేయాలని ఎస్‌జీఎఫ్ కార్యదర్శి జక్కుల శ్రీనివాస్, పోటీల కన్వీనర్ హరిచరణ్‌లు తెలిపారు. మంగళవారం నిర్వహించిన జోనల్ స్థాయి(ఉమ్మడి జిల్లాల) పోటీల్లో ప్రతిభ కన బర్చిన క్రీడాకారులను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేయడం జరిగిందన్నారు. ఎంపికైన క్రీడాకారులకు వచ్చే నెల మొదటి వారం నుంచి శిక్షణ శిబిరం నిర్వహించడం జరుగుతుందన్నారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు తప్పని సరిగా పాఠశాల బోనఫైడ్, పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డులను తప్పని సరిగా అందించాల్సి ఉంటుం దన్నారు. ఈ జట్లకు కోచ్‌లుగా రాష్ట్రపాల్, సాయికుమార్ వ్యవహరిస్తారన్నారు.

ఫాంహౌజ్‌లోనే కేసీఆర్ పాలన: మాజీ మంత్రి

ఆదిలాబాద్ టౌన్: సీఎం కేసీఆర్ పాలన ఫాంహౌజ్‌లోనే కొనసాగుతుందని, అందువల్లనే రాష్ట్రంలో తమ సమస్యలు పరిష్కరించాలని చేపట్టిన వివిధ ఉద్యోగుల దీక్షలు, సమ్మెలు తన దృష్టికి వెళ్లడం లేదని కాంగ్రెస్ పార్టీ మాజీ మంత్రి రాంచంద్రారెడ్డి అన్నారు. డీఆర్డీఏ అనుబంధ మండల స్థాయి ఉద్యోగుల సంక్షేమ సంఘం సెర్ఫ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ఉద్యోగులు చేపట్టిన నిరవధిక సమ్మెకు ఆయన మద్ధతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల స్థాయి అకౌంటెంట్, కంప్యూటర్ ఆపరేటర్లు, స్వీపర్లు తమ సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర వ్యాప్తంగా నిరవదిక సమ్మె చేస్తున్నా ఈ ప్రభుత్వం పట్టించుకున్న పాపాన పోలేదని ఆరోపించారు. అంతే కాకుండా జిల్లా కలెక్టర్ సైతం నిర్లక్ష్యంగా వ్యవహరించడం విడ్డూరంగా ఉందన్నారు. భవిష్యత్తులో ఇలాంటి సీఎంను ఎన్నడు చూడలేమన్నారు. సెర్ప్ ఉద్యోగుల సమస్యలు పరిష్కారమయ్యేంత వరకు కాంగ్రెస్ పార్టీ మద్ధతు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ యాసం నర్సింగ్, నాయకులు సైదఖాన్, సెర్ప్ ఉద్యోగులు జ్యోతిరాం, సర్వేశ్వర్, జలజ, శశిధర్, తుకారం, జైతు, సునిత, మంగ, రాజు, రాంరెడ్డి, పొచ్చన్నలున్నారు.

విద్యార్థులు ఇష్టంతో చదవాలి: డీఈవో

తాంసి: విద్యార్థులు ఇష్టంతో కష్టపడి చదివినప్పుడే మంచి ఫలితాలు సాధ్యమవుతాయని డీఈవో లింగయ్య అన్నారు. బుధవారం మండలంలోని బండల్‌నాగాపూర్ పాఠశాల పనితీరును పరిశీలించారు. పాఠశాల పరిసరాలను పర్యవేక్షించారు. పాఠశాలలో పెంచుతున్న పచ్చదనంతో కూడిన చెట్లకు ఆకర్షితులైయ్యారు. పాఠశాల ఆవరణలో నిర్మించిన మరుగుదొడ్ల నిర్మాణాలే కాకుండా వాటి ఉపయోగంను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో ఉపాధ్యాయులు బోధిస్తున్న తీరును విద్యార్థులను ప్రశ్నించి సమాచారం తెలుసుకున్నారు. క్లాస్‌రూమ్‌లోకి వెళ్లి విద్యార్థులను ప్రశ్నలు అడిగారు. ఈ సందర్భంగా విద్యార్థుల ఫలితాలపై తీసుకోవాల్సిన చర్యల గురించి ప్రత్యేక అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం శరత్‌కుమార్, సర్పంచ్ అనిత వెంకన్న, ఎంపీపీ మంజూల, విద్యార్థులతో పాటు పలువురు పాల్గొన్నారు.

గోవుల హింసను అరికట్టాలని ఎస్పీకి వినితి

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలో ఏకాదశి రోజున బక్రీద్ ఉన్నందున జిల్లాలో ఎక్కువ సంఖ్యలో గోవులు అక్రమ హింసాత్మక రవాణా నుంచి నిరోధించాలని గోసేవా గోసంరక్షక విభాగం ఆధ్వర్యంలో బుధవారం ఓబీసీ మోర్చ రాష్ట్ర కార్యదర్శి కొత్తపెల్లి సంతోష్ అన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీని కలిసి వినతి పత్రం అందించారు. బక్రీద్ పండుగ సందర్భంగా జిల్లాలోకి వేల సంఖ్యలో గోవులు, బలిష్టమైన ఎద్దులు, దూడలు ఇష్టారాజ్యంగా అక్రమ రవాణా చేస్తున్నారన్నారు. ఇందులో గో సంరక్షణ సమితి నాయకులు మాదవ్, ఏబీవీపీ జిల్లా కన్వీనర్ మనోజ్‌పవార్, గోసంరక్షణ సమితి నాయకులు సూర్యకాంత్‌లున్నారు.

ఇంటర్‌లో సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం : ప్రిన్సిపాల్

కుంటాల: మండలకేంద్రం కుంటాలలో గల ఆదర్శ మోడల్ పాఠశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో సీట్ల భర్తీకి దరఖాస్తులు స్వీకరించబడునని ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌ప్రసాద్ తెలిపారు. దీనిలో భాగంగా ఆసక్తి గల అభ్యర్థులు నేరుగా ప్రిన్సిపాల్‌లు సంప్రదించవచ్చని ఆయన పేర్కొన్నారు. ఎంఈసీలో 20, ఎంపీసీలో 1, బైపీసీలో 1 ఖాళీలు ఉన్నాయని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఘనంగా రంగశివ్ తండాలో తీజ్ వేడుకలు

కుభీర్: మండలంలోని రంగశివ్‌ని తండాలో బుధవారం గిరిజన మహిళలు తీజ్ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ప్రతి సంవత్సరం శ్రావణమాసంలో ఈ ఉత్సవాలు నిర్వహించడం గిరిజనులకు ఆనవాయితీ తీజ్ ఉత్సవాల కోసం మహిళలు గుల్లలో మట్టిని పోసి అందులో గోదుమలు వేసి తొమ్మిది రోజులు పాటు నీటిని పోస్తూ పూజిస్తారు. చివరిరోజు పెళ్లికాని యువతులు తీజ్‌ను తలపై పెట్టి ప్రత్యేక పూజలు చేస్తారు. బంజారాల సంప్రదాయం ప్రకారంలో తండాలోని ప్రధానవీధుల గుండా భక్తిగేయాలను ఆలపిస్తూ నృత్యాలు చేస్తూ తండా సమీపంలోని వాగుల, చెరువుల్లో నిమజ్జనం చేశారు. ఇలా చేయడం వల్ల వర్షాలు సంమృద్ధిగా కురిసి పంటను అధికంగ పండుతాయని పశుపక్షాధులకు భగవంతుడు పచ్చని పచ్చికబైళ్లను ప్రసాదిస్తాడని వారి నమ్మకం. ఈ కార్యక్రమానికి ముథోల్ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి, ముఖ్యఅథితిగా పాల్గొని యువతుల తలపై తీజ్‌ను ఎత్తి ఉత్సవాన్ని ప్రారంభించారు.

తండాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట : ఎమ్మెల్యే

కుభీర్: తండాలను గ్రామ పంచాయతీలుగా అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే విఠల్ రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని చాత అనుబంధ, రంగశివుని తాండా నెం.1లో ఎసీడీసీ నిధులు రూ. 3లక్షలతో వేయనున్న గ్రావేల్ రోడ్డు పనులకు భూమి పూజ చేసి ప్రారంభించారు. అనంతరం తాండావసులు ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కార్యక్రమంలో తూం రాజేశ్వర్, రమేష్, ఎన్నిల అనిల్, గంగాధర్, దిగంబర్ పటేల్, ఏశాల విఠల్, నర్సింలు, కుభీర్, చాత, హాల్దా, సర్పంచ్‌లు గోరేకర్‌బాబు, అనిల్‌కుమార్, దేవెంధర్, తండావసులు పాల్గొన్నారు.

కుంటాల విశ్వబ్రాహ్మణ కార్యవర్గం ఎన్నిక

కుంటాల: కుంటాల మండల విశ్వబ్రహ్మణ కార్యవర్గాన్ని బుధవారం ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీధర్, ఉపాధ్యాక్షుడు గోపిల ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా తాసారం లింగం, ప్రధాన కార్యదర్శిగా కట్ట ఉదయ్‌కుమార్, కోశాధికారిగా లక్ష్మీనారాయణ, గౌరవాధ్యక్షుడిగా హన్మాండ్లు, ఉపాధ్యక్షుడిగా బంగారు గణేష్, సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలని ఎమ్మెల్యేకు వినతి

భైంసా రూరల్: గత 40 ఏళ్లుగా గ్రామ పంచాయతీలో విధుల నిర్వహిస్తున్న కారోబార్లు, పారిశుధ్య కార్మికులు, విద్యుత్, నీటి సరఫర అపరేటర్లు తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ ఎమ్మెల్యే విఠల్ రెడ్డికి వినతి పత్రం అందించారు. బుధవారం డివిజన్ కారోబార్‌ల సంఘం అధ్యక్ష, కార్యదర్శులతో పాటు ప్రతినిధులు ఆయనను కలసి వినతి పత్రాన్ని అందించారు. గ్రామ పంచాయతీలలో ప్రత్యేక నిధులు లేవని, అందుకోసం ప్రభుత్వం తమకు ట్రెజరీ ద్వారా వేతనాలు చెల్లించాలని కోరారు. వారిలో డివిజన్ అధ్యక్షులు నారాయణ కారోబార్‌ల సంఘం ప్రతినిధులు అంబాదాస్, మహిపాల్ రెడ్డి, డి.నారాయణ, కే.లక్ష్మణ్, సాయినాథ్, ఆనంద్‌లు ఉన్నారు.

'ఐకమత్యంగా ఉండి స్వచ్ఛ గ్రామంగా తీర్చిదిద్దుదాం'

భైంసా రూరల్: అందరూ ఐక్యమత్యంగా ఉండి మాంజ్రి గ్రామాన్ని ఆరోగ్య గ్రామంగా తీర్చిదిద్దుతామని ఆరోగ్యభారతి సంయోజకుడు డా.రమకృష్ణ అన్నారు. బుధవారం మండలంలోని మాంజ్రీ గ్రామంలో ఆరోగ్యభారతి, గురుకృపా కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ఆరోగ్య గ్రామం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ రాందాస్‌తో పాటు గ్రామపెద్దలు, స్వయ సహాయక సహాయక సంఘాల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

డీజే యజమానుల బైండోవర్

కుంటాల: వినాయక నవరాత్రులను పురస్కరించుకొని మండలంలోని ఓల, కల్లూర్, కుంటాల గ్రామాలకు చెందిన పలువురు డీజే యజమానులను బుధవారం ఎస్సై యూనిస్ అహ్మద్ అలీ తహసీల్దార్ సంతోష్‌రెడ్డి ఎదుట బైండోవర్ చేశారు. అనుమతి లేనిదే ఎవ్వరికీ డీజేలను అద్దెలకు ఇవ్వరాదని ఈ సందర్భంగా ఎస్సై సూచించారు.

అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీచేసిన సీడీపీవో

ముథోల్: మండలంలోని చింతకుంట, చింతకుంట తాండా, వడ్తాల్ గ్రామాలలో గల అంగన్‌వాడీ కేంద్రాలను బుధవారం సీడీపీవో ఛాయాదేవి ఆకస్మిక తనిఖీ చేశారు. కేంద్రంలో గల రికార్డులను పరిశీలించి పలు వివరాలను అంగన్‌వాడీ కార్యకర్తలకు అడిగి తెలుసుకున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు పిల్లలు ఎక్కువ శాతంలో హాజరయ్యే విధంగా చూడాలన్నారు. పౌష్ఠికాహారం సక్రమంగా అందించాలని సూచించారు.

'అర్హులైన వారందరికీ శిక్షణ ఇవ్వాలి'

ముథోల్: రాష్ట్రప్రభుత్వం అర్హులైన ఆర్ఎంపీ, పీఎంపీ గ్రామీణ వైద్యులకు శిక్షణ ఇవ్వాలని జిల్లా గ్రామీణ వైద్యుల సంఘం జిల్లా అధ్యక్షుడు నర్సింగ్ రావు అన్నారు. బుధవారం మండలకేంద్రంలో నిర్వహించిన డివిజన్ స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఆర్ఎంపీ, పీఎంపీలకు త్వరలో శిక్షణ అందిస్తామని వైద్య శాఖ మంత్రి లక్ష్మారెడ్డి హామీ ఇవ్వడం హర్షించదగ్గ విషయమన్నారు. ప్రభుత్వ శిక్షణ ప్రక్రియను వెంటనే పూర్తిచేసి అర్హులైన వారందరికీ శిక్షణ అందజేయాలని కోరారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు డా.మోహన్, కార్యదర్శి డా.సాగర్, మండల అధ్యక్షుడు డా.దుర్గాప్రసాద్, ఉపాధ్యక్షుడు డా.విజయ్‌కుమార్, సహకార్యదర్శి సాయినాథ్‌లున్నారు.

రైతు కష్టం.. అడవి పందుల పాలు!

● పత్తిపంటను నాశనం చేస్తున్న అడవి పందులు ● నష్టపోతున్నరైతులు

ముథోల్: మండల కేంద్రమైన ముథోల్‌తో పాటు చించాల, తరోడ, వెంకటపూర్, ఎడ్‌బిడ్, విఠోలి, ఆష్టా, కారేగాం, తదితర గ్రామ శివారుల్లోని పత్తి పంటలపై అడవి పందులు రాత్రి వేళలో స్వైరవిహారం చేసి నష్టపరుస్తున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కష్టపడి పత్తి పంట వేసామని ఏపుగా పెరగిన పత్తి కొమ్మలను, కాయలను నష్టపరుస్తున్నాయని ఆందోళన చెందుతున్నారు. రాత్రి వేళలో కాపాలకు వెళ్లి వాటిని తరిమే ప్రయత్నం చేస్తే అవి ఎదురుదాడికి దిగుతున్నాయని రైతులు పేర్కొంటున్నారు. అడవి పందుల బారి నుంచి పంటలను రక్షించేందుకు సంబందిత అధికారులు శాఖచర్యలు చేపట్టాలని రైతుల కోరుతున్నారు. చేతికి వచ్చిన పంట అడవి పందుల దాడితో నష్టపోవాల్సి వచ్చిందని రైతులు ఆందోళన చెందుతున్నారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి అడవిపందుల బారి నుంచి పంటను రక్షించాలని రైతులు కోరుతున్నారు.



అడవి పందులు ధ్వంసం చేసిన పత్తి పంట

● నష్టపోతున్నాం : పెక్కంటి సాయినాథ్, రైతు



రూ.80వేల పెట్టుబడి పెట్టి 5 ఎకరాల పత్తి పంట వేశా. రాత్రి అడవి పందులు, మనుబోతులు, పంటపై దాడి చేసి పత్తి కర్రలను తుంచేయడంతో పాటు పత్తికాయలను సైతం తింటూ నష్టపరుస్తున్నాయి. రైతుల బాధను అర్థం చేసుకుని సంబంధిత శాఖ అధికారులు అడవిజంతువుల నుంచి పంటలను కపాడాలి.

● పంటలు నాశనం : పెండెల ప్రసాద్, రైతు



పత్తి పంటపై పందులు గుంపులుగా వచ్చి పంటను నాశనం చేస్తున్నాయి. వాటిని తరిమే ప్రయత్నం చేస్తే ఎదురుదాడికి దిగుతున్నాయి. చేసేది ఏమీ లేక ఊరుకుంటున్నాం. అప్పు చేసి పంటలు పండిస్తే.. పందులతో మరింత నష్టపోతున్నాం. పంటల రక్షణ కోసం అధికారులు తగు చర్యలు తీసుకోవాలి.

రైతు సమస్యల పరిష్కారానికి ఉద్యమాలు : ఏఐకేఎంఎస్

భైంసా: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాల మూలంగా కష్ట, నష్టాల పాలవుతున్న రైతాంగ సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలను ఉధృతం చేద్దామని ఏఐకేఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రంగన్న పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలో జరిగిన అఖిల భారత రైతు కూలీ సంఘం ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా సమావేశంలో పాల్గొని మాట్లాడారు. దేశానికి వెన్నెముకైన రైతన్న ప్రతికూల పరిస్థితులతో ఏమీ చేయాలో పాలుపోక ఆత్మహత్యలకు పాల్పడుతున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. అనేక అన్నదాత కుటుంబాలు నేడు అర్థాకలితో జీవితాలను నెట్టుకువస్తున్నాయని వాపోయారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలు రైతాంగాన్ని దోపిడీ చేసే విధంగా రూపొందిస్తున్నాయని ఆరోపించారు. ఆ తర్వాత జిల్లా అధ్యక్షుడలు నంది రామయ్య మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న వ్యవసాయ వ్యతిరేక విధానాల మూలంగా రైతుల జీవన పరిస్థితులు అతలాకుతలమవుతున్నాయన్నారు. రైతాంగ సంక్షేమాన్ని ప్రభుత్వాలు, పాలకులు ప్రకటనలకే పరిమితం చేయకుండా ఆచరనలో అమలుపరిస్తేనే ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. రైతు ఆత్మహత్యల నివారణకు ప్రభుత్వం ప్రణాళికాబద్ధమైన చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు రాజు, ఎం.శంకర్, తిరుపతి, అంకుశ్‌రావ్, సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర ప్రతినిధి శ్రీనివాస్, దొండ ప్రభాకర్, లాల్‌కుమార్, అశోక్‌లతో పాటు ఉమ్మడి జిల్లా పరిధిలోని ఆయా మండలాల ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రంగన్న

పత్తి పంటకు విల్ట్.. నివారణ చర్యలతో అదుపు

భైంసా రూరల్: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మండలంలో పత్తి పంటకు విల్ట్ చీడ సోకింది దీంతో పంటచేనులో పంట నిట్టనిలువునా వడలిపోతోంది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పత్తికి అధిక శీతలం (తేమ)తో ఈ వ్యాధులు సోకుతాయని వ్యవసాయ అధికారులు తెలుపుతున్నారు. మండలంలోని ఆయా గ్రామ శివారులో ఇటీవల వర్షాలు లేక పోవడంతో పత్తి పంట క్షేత్రాలకు రైతులు తమకు అందుబాటులో ఉన్న బోరుల ద్వారా నీటిని అందించారు. బోర్లతో నీటిని అందించిన పత్తి పంట క్షేత్రాలకు మాత్రమే విల్ట్ సోకిందని రైతుల అంటున్నారు. ఇంతకు ముందు నీటిని అందించని భూములకు విల్ట్ సోకలేదని పేర్కొంటున్నారు. ఎగ్గాం, దేగాం, తదితర గ్రామాల్లో సుమారు 25శాతం పత్తిపంటకు విల్ట్ సోకింది ఈ నేపథ్యంలో వ్యవసాయ అధికారుల పంట క్షేత్రాలను సందర్శించారు. బుధవారం వ్యవసాయ అధికారలు మండలంలోని మాంజ్రి శివారులో పత్తి పంట క్షేత్రాలను సందర్శించి పలు సలహాలు, సూచనలు ఇచ్చారు.

విల్ట్ నివారణకు లీటర్ నీటికి ఆక్సిక్లోరైడ్ మూడు గ్రాములు, కార్బన్‌డైజమ్ కలపి మొక్క మొదల్లలో గ్లాస్‌తో పోయాలి. దీంతో పాటు ఎకరానికి రెండు కేజీల యూరియా నీటిలో కలిపి పిచికారి చేయాలి. విల్ట్ సోకిన పత్తి పూత, పిందేలు రాలకుండా నాఫ్తలీన్, ఎసిపిక్ ఎసిడ్ 10 పీపీఎం ద్రవణాన్ని, లీటరు బోరాన్ 1.5 గ్రాములు నీటికి కలిపి పిచికారి చేయాలి.


దేగాం శివారులో విల్ట్ సోకిన పత్తి పంట

కుంటాల: గత వారం రోజుల నుంచి కురిసిన వర్షాలకు పత్తి పంటలకు సోకిన సారావిల్ట్ మూలంగా పంట ఎదుగుదల నిలిచిపోయింది. ఎండు దశకు చేరడంతో బుధవారం వ్యవసాయ శాఖ ఏఈవోలు లక్ష్మి, శ్రీధర్, మహేష్‌లు దౌనెల్లి, అందకూర్ గ్రామాలలో పర్యటించి పంటలను పరిశీలించారు. నివారణకు సూచనలు, సలహాలు ఇచ్చారు.

నేడు కుంటాలలో ఐకేపీ సర్వసభ్య సమావేశం

కుంటాల: గురువారం కుంటాల మండల ఐకేపీ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఏపీఎం భోజన్న తెలిపారు. ఈ సమావేశంలో నూతన కమిటీ ఎన్నిక, 2016-17 లావాదేవీలపై చర్చ, అభివృద్ధి కార్యక్రమాలు తదితర వాటిపై చర్చించనున్నట్లు ఈ సమావేశానికి సంఘ సభ్యులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

2వ తేదీ వరకు పశువుల సంత బంద్

భైంసా: వినాయక చవితి, బక్రీద్ పర్వదినాలను పురస్కరించుకొని వచ్చే నెల 2వ తేదీ వరకు పశువుల సంత నిర్వహించడం లేదని భైంసా వ్యవసాయ మార్కెట్ కమిటి అధికార యంత్రాంగం ఒక ప్రకటనలో తెలిపింది. భైంసా పట్టణ పోలీసు అధికారులు సంబంధిత విషయమై లేఖ ద్వారా కోరిన దృష్ట్యా పశువుల సంతను వచ్చేనెల 2వ తేదీ వరకు నిర్వహించబోమన్నారు. రైతులు, పశువుల కొనుగోలుదారులు, అమ్మకందారులు ఈ విషయాన్ని గుర్తుపెట్టుకొని సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

ఇంటర్వ్యూ

గ్రామాల్లో సరుకులు సకాలంలో అందించేందుకు చర్యలు


అజీజ్‌ఖాన్, డిప్యూటీ తహసీల్దార్

ఆంధ్రజ్యోతి: గ్రామాల్లో సరుకులు సకాలంలో అందించేందుకు ఎలాంటి చర్యలు చేపడుతున్నారు?

అధికారి: మండలంలోని 11 గ్రామ పంచాయతీ పరిధిలో గల చౌకధరల దుకాణల ద్వారా ప్రతీనెల సకాలంలో సరకులు అందించేందుకు డీలర్ల ద్వార ఎప్పటికప్పుడు సమావేశాలు నిర్వహిస్తు కార్డుదారులకు సరుకులు సరైన సమయంలో అందించేందుకు చర్యలు చేపడుతున్నాం.

ఆంధ్రజ్యోతి: సాదాబైనామల ద్వారా ఎన్ని దరఖాస్తులు వచ్చాయి. ఎన్ని పరిష్కరించారు?

అధికారి: మండలంలోని ఆయా గ్రామాలలో రైతుల నుంచి 693 సర్వే నెం. గానూ 509 దరఖాస్తులు రాగా నిబంధనల మేరకు సక్రమంగా ఉన్న 24 దరఖాస్తులను పరిష్కరించడం జరిగింది. మిగతావి నిబంధనల మేరకు తిరస్కరించారు.

ఆంధ్రజ్యోతి: రెవెన్యూ రికార్డులను సరిచేస్తున్నారా?

అధికారి: ప్రభుత్వ ఆదేశాల మేరకు రైతుల భూముల వివరాలను ఆన్‌లైన్‌లో సరిచేయడం కొనసాగుతోంది. పాసుపుస్తకాల్లో భూముల వివరాలు, పేర్లలో పొరపాట్లు, 1బీ, పహణిల్లో పొరపాట్లు ఉంటే సరిచేస్తూ ఆన్‌లైన్‌లో క్రోడికరిస్తున్నాం.

- కుంటాల

దినఫలాలు

అదృష్టసంఖ్యలు: 5, 7




మేషరాశి: (మార్చి21-ఏప్రిల్20): వృత్తి, వ్యాపారాల్లో లక్ష్య సాధనకు భాగస్వామి సహకారం లభిస్తుంది. కృషి రంగంలో కొత్త పరిచయాలు ఏర్పడతాయి. సంకల్పం నెరవేరుతుంది. ప్రియతములతో విందు వినోదాల్లో పాల్గొంటారు.



వృషభరాశి: (ఏప్రిల్21-మే20): చిన్నారులు, ప్రియతముల విషయాల్లో శుభపరిణామాలు సంభవం. సృజనాత్మకంగా వ్యవహరించి వృత్తి, వ్యాపారాల్లో లక్ష్యాలు సాధిస్తారు. క్యాటరింగ్, వ్యవసాయం, పరిశ్రమల రంగాల వారికి అనుకూలం.



మిథునరాశి: (మే21-జూన్21): ఇంటి కోసం విలువైన వస్తువులు సమకూర్చుకుంటారు. లక్ష్యాలు సాధిస్తారు. ప్రియతముల రాకతో ఇంట్లో సందడి వాతావరణం నెలకొంటుంది. విద్యాసంస్థల్లో ప్రవేశం కోసం చేసే ప్రయత్నాలు ఫలిస్తాయి.



కర్కాటకరాశి: (జూన్22-జూలై23): కుటుంబ సభ్యులతో ప్రయాణాలు ఉల్లాసం కలిగిస్తాయి. బంధుమిత్రుల కలయిక ఆనందం కలిగిస్తుంది. రియల్ ఎస్టేట్, నిర్మాణ రంగాల వారికి ప్రోత్సాహకరం. సమావేశాలకు ఏర్పాట్లు చేస్తారు.



సింహరాశి: (జూలై24-ఆగస్ట్23): రవాణా, ఏజెన్సీలు, బోధన రంగాల వారికి ఆర్థికంగా ప్రోత్సాహకరం. పెట్టుబడులకు సంబంధించిన చర్చలు ఫలిస్తాయి. ఆర్థిక విషయాల్లో సన్నిహితుల సహకారం అందుకుంటారు. కాంట్రాక్టులు, అగ్రిమెంట్లు లాభిస్తాయి.



కన్యారాశి: (ఆగస్ట్24-సెప్టెంబర్23): పొదుపు పథకాలు లాభిస్తాయి. వ్యక్తిగత సౌకర్యాల కోసం ఖర్చు చేస్తారు. ఆర్థిక వ్యవహారాల్లో కొత్త ప్రయోగాలకు తగిన సమయం. సంకల్పం నెరవేరుతుంది.



తులారాశి: (సెప్టెంబర్24-అక్టోబర్23): ఉన్నత విద్య, విదేశీ వ్యవహారాల్లో లక్ష్యాలు సాధిస్తారు. వాయిదా పడుతున్న పనులు పట్టుదలతో పూర్తి చేస్తారు. రాజకీయ, సినీరంగాల వారికి ఉల్లాసంగా ఉంటుంది. ఒక సమాచారం ఆహ్లాదం కలిగిస్తుంది.



వృశ్చికరాశి: (అక్టోబర్24-నవంబర్22): బంధుమిత్రులతో వేడుకల్లో పాల్గొంటారు. దీర్ఘకాలిక పెట్టుబడులకు అనుకూలం. సినీ, రాజకీయ, ఫొటోగ్రఫీ, ఎగుమతుల రంగాల వారికి ఆర్థికంగా ప్రోత్సాహకరం. ఒక సమాచారం ఉత్సాహం కలిగిస్తుంది.



ధనూరాశి: (నవంబర్23-డిసెంబర్21): బ్యాంకులు, ఆర్థిక సంస్థలకు సంబంధించిన పనులు పూర్తవుతాయి. ఆర్థిక వ్యవహారాల్లో పెద్దల సహకారం లభిస్తుంది. వృత్తి, వ్యాపారాల్లో ప్రోత్సాహకరం సమావేశాల్లో ప్రముఖులను కలుసుకుంటారు.



మకరరాశి(డిసెంబర్22-జనవరి21): వేడుకలు, సమావేశాల్లో ప్రముఖులతో పరిచయాలు ఏర్పడతాయి. ప్రమోషన్లు, ఇంక్రిమెంట్ల కోసం చేసే ప్రయత్నాలు ఫలిస్తాయి. వృత్తి, వ్యాపారాల్లో వ్యూహాత్మకంగా వ్యవహరించి లక్ష్యాలు సాధిస్తారు.



కుంభరాశి: (జనవరి22-ఫిబ్రవరి18): బంధుమిత్రులతో సమావేశాలు ఉల్లాసం కలిగిస్తాయి. పూర్వమిత్రులను కలుసుకుంటారు. లక్ష్య సాధనలో గత అనుభవం తోడ్పడుతుంది. ప్రయాణాలకు అవసరమైన నిధులు సర్దుబాటవుతాయి.



మీనరాశి:(ఫిబ్రవరి19మార్చి20): ఆర్థిక విషయాల్లో భాగస్వామి సహకారం లభిస్తుంది. భాగస్వామి కోసం విలువైన వస్తువులు కొనుగోలు చేస్తారు. ఆరోగ్యంపై దృష్టి సారించాలి. స్పెక్యులేషన్లు, పందాలు, పోటీల్లో పాల్గొంటారు.

-బిజుమళ్ళ బిందుమాధవ శర్మ

పండుగలు శాంతియుతంగా జరుపుకోవాలి

● అధికారులు సమన్వయంతో ఏర్పాట్లను పూర్తి చేయాలి ● పీస్ కమిటీ సమావేశంలో సీపీ విక్రంజిత్ దుగ్గల్, కలెక్టర్ ఆర్వీ కర్ణన్

మంచిర్యాల క్రైం: హిందూ, ముస్లిం సోదరులు వినాయక నవరాత్రి ఉత్సవాన్ని, బక్రీద్ పండగలను శాంతియుతంగా జరుపుకోవాలని రామగుండం పోలీస్ కమిషనర్ విక్రంజిత్ దుగ్గల్, కలెక్టర్ ఆర్వీ కర్ణన్ సూచించారు. బుధవారం ఎఫ్‌సీఏ ఫంక్షన్‌హాల్‌లో జిల్లా కలెక్టర్ ఆర్వీ కర్ణన్, జిల్లా పోలీస్ అధికారులతో కలిసి శాంతి కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రామగుండం పోలీస్ కమిషనర్ విక్రంజిత్ దుగ్గల్ మాట్లాడుతూ హిందూ, ముస్లింలు సోదర భావంతో మెలగాలన్నారు. ప్రజలు మట్టి విగ్రహాలతో తయారు చేసిన గణపతులనే పూజించాలన్నారు. రసాయనాలతో చేసిన విగ్రహాలు వాడడం వల్ల నీరు కలుషితమై ప్రజల ఆరోగ్యం దెబ్బతింటుందన్నారు. ముఖ్యంగా వినాయక మండపాల వద్ద జాగ్రత్తలు పాటించాలన్నారు. ఖచ్చితంగా పోలీసుల అనుమతి తీసుకునే మండపాలు ఏర్పాటు చేయాలని సూచించారు. బలవంతంగా ఎవరి వద్ద చెందాలు వసూలు చేయరాదన్నారు. విద్యుత్ పర్మిషన్ తీసుకోవాలని, డీజేలు వాడవద్దని, పది గంటల లోపు మైక్‌లు ఆపివేయాలని, ఎలాంటి మత్తు పదార్థాలు, మద్యం సేవించరాదన్నారు. మైకు అనుమతిని పోలీస్ స్టేషన్‌లోతీసుకోవాలని, రాత్రి సమయంలో తప్పనిసరిగా వలంటరీలను ఉంచాలని, ఆసుపత్రులకు, విద్యా సంస్థలకు అసౌకర్యం కలిగించకూడదన్నారు. షార్ట్‌సర్క్యూట్ ప్రమాదాలపై జాగ్రత్తలు వహించాలన్నారు. నిమజ్జనానికి సూచించిన సమయాల ప్రకారం మండపాల యజమానులు, భక్తులు పోలీసులకు సహకరించాలన్నారు. వినాయకుని ఉత్సవం మొదలుకొని నిమజ్జనం వరకు ఆయా కమిటీ నిర్వాహకులు పూర్తి బాధ్యత వహించాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీపీ దుగ్గల్



పాల్గొన్న హిందూ, ముస్లిం మత పెద్దలు

వినాయక నవరాత్రి ఉత్సవాల సందర్భంగా అధికారులు సమన్వయంతో ఏర్పాట్లను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆర్వీ కర్ణన్ అన్నారు. ప్రతీ ఒక్కరు మట్టి విగ్రహాలను పూజించి నీటి కాలుష్యాన్ని నివారించాలన్నారు. నిమజ్జనం సమయంలో నీటి లోతుకు వెళ్లకుండా ఎలాంటి ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు వహించాలన్నారు. గూడెం వద్ద భారీ విగ్రహాల నిమజ్జనం కోసం నాలుగు క్రేన్‌లను ఏర్పాటు చేయడం జరిగిందని, విద్యుత్ దీపాలను పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ప్రతీ ఒక్కరు రోడ్ మ్యాప్ పాటించి నిమజ్జనానికి సహకరించాలన్నారు. ప్రతీ ఒక్కరు హరితహారాన్ని విజయవంతం చేసేందుకు మండపాల ఆద్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. ఈ సందర్భంగా హిందూ కమిటీ సభ్యులు మాట్లాడుతూ భారీ విగ్రహాలను తరలించేందుకు ఓవర్ బ్రిడ్జి వద్ద డివైడర్‌ను తొలగించాలని విన్నవించారు. రోడ్డు మరమ్మతులు చేయాలని, డిష్ కేబుల్, నెట్ కేబుల్‌లు భారీ విగ్రహాలకు అడ్డం రాకుండా తొలగించాలని విన్నవించారు.

బక్రీద్ సమయంలో పోలీసులు తమకు సహకరించాలని ముస్లిం కుల పెద్దలు విన్నవించారు. ఈ కార్యక్రమంలో డీసీపీ జాన్‌వెస్లీ, ఏసీపీలు చెన్నయ్య, కవిత, ఆర్డీఓలు శ్యామలాదేవి, వీరన్న, మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్, మంచిర్యాల ఇంచార్జి సీఐతో పాటు జిల్లాలోని సీఐలు, ఎస్సైలు, హిందూ, ముస్లిం కుల పెద్దలు పాల్గొన్నారు.

క్రీడలతో విద్యార్థుల్లో మానసికోల్లాసం

● జిల్లా స్థాయి పోటీల్లో ఎంవీఐ వివేకానందరెడ్డి



ఫుట్‌బాల్ ఆడుతున్న క్రీడాకారులు

మంచిర్యాల క్రైం: క్రీడలతో విద్యార్థులు మానసికంగా, శారీరకంగా ఎదుగుతారని ఎంవీఐ వివేకానందరెడ్డి అన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆద్వర్యంలో బుధవారం బాలుర ఉన్నత పాఠశాలలో జిల్లా స్థాయి ఎంపిక పోటీలలో ఎంవీఐ వివేకానందరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల్లో ప్రతిభ కనబరిచిన వారికి మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. అనంతరం సీఐ మాట్లాడుతూ పాఠశాల స్థాయి నుంచి విద్యార్థులు క్రీడల్లో తప్పనిసరిగా శ్రద్ధ చూపించాలన్నారు. క్రీడలతో రిజర్వేషన్‌ల వల్ల ఉద్యోగాలు సైతం పొందవచ్చన్నారు. అనంతరం విద్యాశాఖ అధికారి రవికాంత్‌రావు మాట్లాడుతూ ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారిని జిల్లా స్థాయిలో ఎంపిక చేయడం జరుగుతుందన్నారు.

ఈ పోటీల్లో జిల్లా నుంచి సుమారు 350 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంవీఐ వివేకానందరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, అసోసియేషన్ సభ్యులు చంద్రమోహన్‌గౌడ్, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

గంగపుత్ర కాలనీలో తీరనున్న కష్టాలు

తాగునీటి సమస్య పరిష్కారానికి చైర్‌పర్సన్ హామీ

● ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన

కాగజ్‌నగర్: కాగజ్‌నగర్ పట్టణంలోని గంగపుత్ర కాలనీలోని తాగునీటి సమస్యపై ఆంధ్రజ్యోతి మినిలో మూడు రోజుల క్రితం 'నీరు లేదు.. దారి లేదు..' అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి మున్సిపల్ చైర్‌పర్సన్ సీపీ విద్యావతి స్పందించారు. ఈ సందర్భంగా కాలనీలో బుధవారం తాగునీటి సమస్యపై వాకాబు చేశారు. త్వరలోనే తాగునీటి సమస్యకు ప్రత్యామ్నాయ మార్గం చూయించేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. కాగజ్‌నగర్ పట్టణంలోనే ఉన్నప్పటికీ విస్తరణ పరిధి మాత్రం మండలంలోకి రావటం బాధాకరమైన విషయమైనప్పటికీ 100 మంది తాగునీటి కష్టాలు తీర్చేందుకు మానవీయ కోణంలో ఈ సమస్యను పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకుంటామన్నారు. గంగపుత్ర కాలనీ వాసులు అధైర్యపడాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. మా కష్టాలను వెలుగులోకి తెచ్చిన ఆంధ్రజ్యోతికి ఎప్పటికీ రుణ పడి ఉంటామని కాలనీ వాసులు పేర్కొన్నారు.

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

● ప్రభుత్వ విప్ నల్లాల ఓదెలు

జైపూర్: సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ప్రభుత్వ విప్ నల్లాల ఓదెలు కార్యకర్తలకు సూచించారు. కష్టపడి పని చేసిన వారిని పార్టీ గుర్తిసుందని ఆయన పేర్కొన్నారు. మండల కేంద్రంలో ముఖ్య కార్యకర్తలతో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉద్యమంలో పాల్గొన్న వారితో పాటు తెలంగాణ అభివృద్ధి కోసం పాటుపడుతున్న వారికి పార్టీలో సముచిత స్థానం కల్పించడం జరుగుతోందని పేర్కొన్నారు. బంగారు తెలంగాణ కోసం పరితపిస్తున్న సీఎం కేసీఆర్ ప్రజా ప్రయోజనాల దృష్టితో అనే అభివృద్ధి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. నిధులు, నీరు, నియామకాలతో అభివృద్ధి సాధ్యమవుతోందని భావించిన సీఎం కేసీఆర్ తెలంగాణ రాష్ట్రంలో 44 వేల చెరువులను మిషన్ కాకతీయ పథకం ద్వార పునరుద్ధరించడం జరిగిందని



జైపూర్‌లో మాట్లాడుతున్న విప్ నల్లాల ఓదెలు

పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఒక లక్షా 26 వేల ఉద్యోగాలు బర్తీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. 60 సంవత్సరాలు అభివృద్ధికి నోచుకోని తెలంగాణ అభివృద్ధికి టీఆర్ఎస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధిని ఓర్వలేని ప్రతిపక్ష పార్టీలు బురుదజల్లేందుకు ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. నియోజకవర్గంలో ప్రతిపక్షం లేకుండా టీఆర్ఎస్ కార్యకర్తలు కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే ఓదెలు పేర్కొన్నారు. నియోజకవర్గం ప్రజలు సంక్షేమం కోరి ఎమ్మెల్యేగా నిరంతరం కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. నియోజకగవర్గంలో రోడ్డు నిర్మాణాలు పూర్తి చేసినట్లు పేర్కొన ఆయన గ్రామ పంచాయతీల పరిధిలో అంతర్గత రోడ్లు నిర్మించాల్సివుందని పేర్కొన్నారు. ప్రత్యేక ప్రణాళికతో అంతర్గత రోడ్లు నిర్మించడం కోసం కృషి చేస్తున్నట్లు పేర్కొంటూ పార్టీ నాయకులను,, కార్యకర్తలను భాగస్వాములను చేయనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో స్థానిక ఎంపీపీ మెండె హేమలత, జెడ్పీటీసీ సభ్యులు జర్పుల రాజకుమార్ నాయక్, ఉమ్మడి మండలం టీఆర్ఎస్ ఇన్‌చార్జీ చేకుర్తి సత్యనారాయణ రెడ్డి, మండల కన్వీనర్ రిక్కుల మధూకర్ రెడ్డి, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షులు మంతెన లక్ష్మన్, సర్పంచుల ఫోరం అధ్యక్షులు చల్ల విశ్వంబర్ రెడ్డి పాల్గొన్నారు.

గ్రామసభల్లో డబుల్ లబ్ధిదారుల ఎంపిక

◆ డబుల్ బెడ్‌రూం ఇళ్ల పథకంలో ఎట్టకేలకు కదలిక ◆ లబ్ధిదారులతో సొసైటీల ఏర్పాటు ◆ ఈనెల 26నుంచి సెప్టెంబర్ 10వరకు గ్రామాల్లో సభలు

గత మూడేళ్ల నుంచి.. గూడు లేని పేదలను ఊరిస్తూ వస్తున్న డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణ పథకానికి ఎట్టకేలకు కదలిక వచ్చింది. ఇప్పటి వరకు ఇళ్ల నిర్మాణానికి స్థలాలు అందుబాటులో లేకపోవడం, అలాగే నిర్మాణ వ్యయం అంచనాలు తక్కువగా ఉండడంతో కాంట్రాక్టర్‌లు ముందుకు రావడం లేదు. పలుసార్లు నిర్వహించిన టెండర్ ప్రక్రియ కూడా పూర్తిగా విఫలమైన సంగతి తెలిసిందే. అయితే రాష్ట్ర ప్రభుత్వంపైనే కాకుండా స్వయంగా జిల్లాకు చెందిన గృహ నిర్మాణ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి కూడా డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణ విషయంలో విమర్శలు ఎదుర్కొంటున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వం డబుల్ బెడ్‌రూం ఇళ్ల విషయంలో పలుమార్పులతో కూడిన తాజా నిబంధనలతో కూడిన ఉత్తర్వులను జారీ చేసింది. ఈ నిబనంధనల ప్రకారం టూ, త్రీ, ఫోర్ వీలర్ వంటి వాహనాలు ఉన్న వారికి, ల్యాండ్ ఫోన్, రిఫ్రిజిరేటర్ ఉన్న వారికి ఇక డబుల్ బెడ్‌రూం ఇళ్లు మంజూరు కావు. అలాగే డబుల్ బెడ్‌రూం ఇళ్లను నిర్మించేందుకు కొన్ని గ్రామాలను ఎంపిక చేయనున్నారు. ఈ గ్రామాల ఎంపిక బాధ్యత జిల్లాస్థాయి అమలు కమిటీకి అప్పజెప్పారు. కాగా ఈ ఇళ్లు నిర్మించేందుకు కాంట్రాక్టర్‌లు ముందుకు రానట్లయితే అక్కడి ఎంపిక చేసిన లబ్ధిదారులతో సహకార సంఘాలను ఏర్పాటు చేసి ఆ సంఘాల ఆధ్వర్యంలో ఇండ్ల నిర్మాణాలను చేపట్టనున్నారు. ఇదిలా ఉండగా 2011 సంవత్సరంలో నిర్వహించిన జనాభా లెక్కల సందర్భంగా గుర్తించిన ఇల్లు లేని పేదలకు ఇప్పుడు ప్రత్యేకంగా అవకాశం కల్పించ్చానున్నారు. అప్పట్లో జిల్లాలో 5787 ఇండ్లు లేని వారికిగా గుర్తించబడ్డారు. ఇదిలా ఉండగా ఈనెల 26 నుంచి సెప్టెంబర్ 10 వరకు గ్రామసభలను నిర్వహించి కొత్త లబ్ధిదారులను ఎంపిక చేయనున్నారు. కొత్త లబ్దిదారులతో పాటు కలెక్టర్ ఫిర్యాదుల విభాగంలో దరఖాస్తు చేసుకున్న 2000 మందిని కూడా విచారణ జరిపిన తరువాత వారిలో అర్హులను పరిగణలోకి తీసుకోనున్నారు.

● లబ్ధిదారుల ఎంపిక కీలకం

డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణ వ్యవహారంలో లబ్ధిదారుల ఎంపిక కీలకంగా మారనుంది. ఇప్పటికే అధికార పార్టీ నాయకులు చాలా చోట్ల డబుల్ బెడ్‌రూం ఇళ్లపై హామీ ఇచ్చారు. దీనికి తోడు నేతల అనుచరులు, సానుభూతి పరులు ఈ ఇళ్ల కోసం ఎదురు చూస్తున్నారు. ఇదిలా ఉండగా 2011 జనాభా లెక్కల సందర్భంగా జిల్లాలో దాదాపు 5,787 మందిని ఇండ్లు లేని వారికిగా గుర్తించారు. ప్రతి సోమవారం జిల్లా కలెక్టర్ నిర్వహించే ఫిర్యాదుల విభాగంలో దాదాపు 2వేల మంది దరఖాస్తు చేసుకున్నారు. మొత్తం 7,887 దరఖాస్తులు పెండింగ్‌లో ఉండగా గ్రామసభల ద్వారా ఎంపిక చేసే లబ్ధిదారులను వారితో కలిపి ఇళ్లను విభజించనున్నారు. ఇదిలా ఉండగా లబ్ధిదారుల ఎంపికకు అనేక నిబంధనలు విధించడంతో ఎంపిక ప్రక్రియ అధికారులకు కత్తి మీద సాములా మారనుందంటున్నారు. మరోవైపు రాజకీయ నాయకుల నుంచి ఒత్తిళ్లు కూడా పెద్ద ఎత్తున ఉండడం సహజమే.

● టూ వీలర్ ఉంటే తిరస్కరణ

డబుల్ బెడ్‌రూం ఇళ్లు పొందేందుకు కఠిన నిబంధనలు విధించారు. దరఖాస్తుదారుడికి టూ వీలర్, త్రీ, ఫోర్ వీలర్ వంటి వాహనాలు ఉన్నట్లయితే వారి దరఖాస్తులు తిరస్కరణకు గురి కానున్నాయి. ఇవే కాదు ప్రస్తుతం నివసించే ఇంట్లో ల్యాండ్ లైన్ ఫోన్, రిఫ్రిజిరేటర్ ఉన్న వారికి అవకాశం కల్పించడం లేదు. అలాగే ట్రాక్టర్ ఉన్న, కిసాన్ క్రెడిట్ కార్డు ఉన్న, కుటుంబ సభ్యుల్లో ఎవరికైనా నెలకు రూ.10 వేలకు మించి ఆదాయం ఉన్న వారి దరఖాస్తులను స్వీకరించరు. ప్రభుత్వ ఉద్యోగులు, ఆధాయం పన్ను, చెల్లించే వారు అనర్హులే. అయితే రిఫ్రిజిరేటర్, టూవీలర్, ల్యాండ్ లైన్ ఫోన్ ప్రస్తుతం పేదలకు కూడా ఉండడంతో ఈ నిబంధన వివాదాస్పదం కానుంది.

● లబ్ధిదారుల సొసైటీలకే నిర్మాణ బాధ్యతలు

డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాలకు కాంట్రాక్టర్‌లు ముందుకు రానట్లయితే ఎంపిక చేసిన లబ్ధిదారులతో సొసైటీలను ఏర్పాటు చేయనున్నారు. ఈ సొసైటీలకే ఇక ఇళ్ల నిర్మాణ భాధ్యతలను అప్పగించనున్నారు. సొసైటీల ఏర్పాటు ప్రక్రియతో పాటు వారి చేత ఇళ్ల నిర్మాణ వ్యవహారాలను సైతం జిల్లా సహకార శాఖకు అప్పగించారు. ఇదిలా ఉండగా జిల్లాలో మొదటి దశ కింద కొన్ని గ్రామాలను ఎంపిక చేయనున్నారు. ఈ గ్రామాల ఎంపిక వ్యవహారాన్ని జిల్లాస్థాయి అమలు కమిటీని అప్పజెప్పారు.

● ప్రతీ సెగ్మెంట్‌కు 14 ఇళ్లు

ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గానికి 1400 డబుల్ బెడ్‌రూం ఇళ్లను నిర్మించాలని మొదట నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఈ ఇళ్ల నిర్మాణానికి భూమి కూడా అందుబాటులో ఉన్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. కాగా, మొదటి విడత 960 ఇళ్లను నిర్మించాలని తలపెట్టగా.. ఇందులో నుంచి 540 ఇళ్ల నిర్మాణాలకు టెండర్‌లను పిలిచినప్పటికీ మంత్రి స్వగ్రామమైన ఎల్లపెల్లి మినహా ఇప్పటి వరకు ఒక్క ఇల్లు నిర్మాణం కూడా పూర్తి కాలేదు.

● గ్రామాల్లో 26 నుంచి సభలు

ఈనెల 26నుంచి సెప్టెంబర్ 10వరకు గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించనున్నారు. గతంలో వచ్చిన దరఖాస్తులను ఈ గ్రామసభలో బహిరంగంగా పరిశీలించనున్నారు. అలాగే, వీటికి సంబంధించి కొత్త దరఖాస్తులను కూడా తీసుకోనున్నారు. దరఖాస్తు దారుడు పక్కా పేదలుగా ఉండాలన్నదే ప్రధాన నిబంధన కాబోతుంది. అలాగే స్కావెంజర్‌లు, కూలీలు ఎలాంటి ఆశ్రమం లేని వారికి ప్రాధాన్యత కల్పించబోతున్నారు. లబ్ధిదారుల ఎంపిక తరువాత ఇక ఇళ్ల నిర్మాణాలు మొదలు కానున్నాయి.

(- ఆంధ్రజ్యోతి, నిర్మల్)

● గ్రామసభల నిర్వహణకు కసరత్తు

- సూర్యచందర్‌రావు, జిల్లా సహకార అధికారి, నిర్మల్



ఈ విషయమై జిల్లా సహకార అధికారి సూర్యచంద్రరావును సంప్రదించగా డబుల్ బెడ్‌రూం పథకం కింద లబ్ధిదారుల ఎంపిక కోసం కసరత్తు మొదలు పెట్టినట్లు తెలిపారు. దీనిలో భాగంగా ఈనెల 26 నుంచి గ్రామాల్లో గ్రామసభలు ఏర్పాటు చేసి 2011లో గుర్తించబడ్డ లబ్ధిదారులతో పాటు గ్రామసభల ద్వారా వచ్చిన దరఖాస్తులను స్వీకరించనున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తాజాగా కొత్త నిబ్యాధనలతో కూడిన ఉత్తర్వులను జారీ చేసిందని, ఆ నిబంధనల ప్రకారమే ఎంపిక ప్రక్రియ జరుగుతుందని ఆయన వివరించారు.

కోదండరాం ప్రతిపక్షాల చేతిలో కీలుబొమ్మ

● ఢిల్లీలో తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి వేణుగోపాలచారి

నిర్మల్ కల్చరల్: ఉద్యమాల కోసం జేఏసీ అధ్యక్షుడిగా వ్యవహరించిన ప్రొఫెసర్ కోదండరాం ప్రస్తుతం ప్రభుత్వ వ్యతిరేక ఆందోళనకు ఆజ్యం పోస్తున్నారని ఢిల్లీలో తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి వేణుగోపాల చారి ఆరోపించారు. బుధవారం ఆయన నిర్మల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ సమయంలో కోదండరాంను జేఏసీ చైర్మన్‌గా నియామకం చేసినందుకు ఆయనకు తగిన గుర్తింపు లభించిందన్నారు. రాష్ట్రంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు ప్రభుత్వం చేపడుతుంటే.. అవి కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీలతో పాటు కోదండరాంకు కనిపించడం లేదా? అని ప్రశ్నించారు. కోటి ఎకరాలకు నీరందించేందుకు మల్లన్న సాగర్ ప్రాజెక్టును చేపట్టగా అక్కడ వాస్తవ పరిస్థితులను చూసి కిమ్మనకుండా ఉన్నారని, కాళేశ్వరం గోదావరి నుంచి శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ద్వారా 16 లక్షల ఎకరాలకు సాగునీరందించేందుకు స్థిరీకరించకుండాడా.. దీనిని రాజకీయం చేస్తున్నారని అన్నారు. మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ పథకాలతో పాటు ప్రాజెక్టు నిర్మాణాలకు ఆటంకం కలిగించేందుకు 192 కేసులు వేసిన ఘనత ప్రతిపక్షాలదేనన్నారు. రాష్ట్ర పరువు దేశ వ్యాప్తంగా దెబ్బతీసే విధంగా ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ఆందోళనలు చేయడం సిగ్గు చేటన్నారు. రాష్ట్రంలో అమలవుతున్న పథకాలకు ప్రధాని మోదీ నుంచి ప్రశంసలు లభించిన విషయాన్ని గుర్తించాలన్నారు. ఏకంగా దేశ వ్యాప్తంగా అభివృద్ధి పథకాల అమలులో కేంద్ర ప్రభుత్వం నుంచి 17 అవార్డులు తెలంగాణ ప్రభుత్వం అందుకొని ఆదర్శంగా నిలిచిందన్నారు. ఇకనైనా కోదండరామ్ ప్రతిపక్షాలతో లోపాయికారి ఒప్పందం మానుకోవాలని, ఆయన హుందా తనానికి తగినట్లు వ్యవహరించాలన్నారు. రాష్ట్ర ప్రతిష్ట ఢిల్లీస్థాయిలో దిగజార్చవద్దని, అభివృద్ధికి సహకరించి తగిన సలహాలు అందించాలన్నారు. ప్రతిపక్షాలు సైతం పదేపదే ప్రభుత్వంపై విమర్శలు చేయడం మాని బంగారు తెలంగాణలో భాగస్వాములు కావాలని సలహానిచ్చారు.

ఖానాపూర్ జీపీని సందర్శించిన ట్రైనీ ఐఏఎస్

ఖానాపూర్: ఖానాపూర్ మేజరు గ్రామపంచాయతీని బుధవారం ట్రైనీ ఐఏఎస్ వి.క్రాంతిరెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మేజరు గ్రామ పంచాయతీ కార్యదర్శి విధులు, విధానాల పట్ల తెలుసుకున్నారు. నిర్మల్ జిల్లాలో ట్రైనింగ్ పొందేందుకు వచ్చినట్లు ఆమె పేర్కొన్నారు. గ్రామ పంచాయతీ పరిధిలో చేపడుతున్న పనులను పంచాయతీ కార్యదర్శి శ్రీధర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట నిర్మల్ డిప్యూటీ తహసీల్దార్ ఏజాస్‌ఖాన్, తదితరులున్నారు.



జీపీ కార్యాలయంలో కంప్యూటరులో పొందుపరిచిన రికార్డులను పరిశీలిస్తున్న ట్రైనీ ఐఏఎస్

ఆలనా పాలనా లేని ఐటీడీఏ!

● గత యేడాది కాలంగా ఇన్‌చార్జీ అధికారులే దిక్కు
● కుంటుపడుతున్న పాలన

కొండ కోనల్లో నివసించే ఆదివాసీ గిరిజనుల సర్వతోముఖాభివృద్ధికి పాటు పడే ఉట్నూర్ ఐటీడీఏ ఆలన పాలన లేకుండా పోతోంది. గత కొన్నేళ్లుగా మసక బారుతున్న ఐటీడీఏ పాలన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా విభజనతో మరీ అధ్వానంగా తయారైంది. పాలన సౌలభ్యం కోసం కొత్త జిల్లాలను ఏర్పాటు చేసిన ప్రభుత్వం.. దాకి అనుగుణంగా అధికారులను నియమించక పోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. అయితే, ఐటీడీఏ పాలన ఇప్పుడిప్పుడే గాడిలో పడుతుందనుకున్న సమయంలో ఐటీడీఏ పీఓ ఆర్వీ కర్ణన్‌ను పదోన్నతిపై మంచిర్యాల జిల్లా కలెక్టర్‌గా ప్రభుత్వం బదిలీ చేసింది. దీంతో బదిలీపై వెళ్లిన కర్ణన్‌నే అప్పటి నుంచి ఇన్‌చార్జీ పీవోగా వ్యవహరిస్తున్నారు. పాలన సౌలభ్యం మాట దేవుడెరుగు గానీ, జిల్లా విభజనతో ఐటీడీఏకు కొత్త చిక్కులు మొదలయ్యాయి. పూర్తిస్థాయి అధికారి లేక పోవడంతో పాలన పట్టుతప్పి ప్రభుత్వ పథకాలు గిరిజనుల ధరికి చేరడం లేదు.

● ప్రధాన శాఖల్లోనూ ఇన్‌చార్జీలే..

ఐటీడీఏ పాలన అధికారి పీవోతో పాటు పలు విభాగాలకు చెందిన అధికారులు కూడా ఇన్‌చార్జి అధికారులుగానే కొనసాగుతున్నారు. ప్రధాన శాఖలుగా చెప్పుకునే విద్య, వైద్యం విభాగాల్లో కూడా ఇన్‌చార్జి అధికారులే కొనసాగడం గమనార్హం. అంతేకాకుండా, ఇన్‌చార్జి వైద్య ఆరోగ్య శాఖాధికారిగా తోడసం చందును నియమించగా కుష్టు వ్యాధి నివారణ అధికారి, కుటుంబ నియంత్రణ అధికారి, ఏడీఎంహెచ్ఓ, డిప్యూటీ డీఎంహెచ్‌వో, పీఏవో, టీహెచ్‌వో, స్టాటిస్టికల్ అధికారులు ఇన్‌చార్జి అధికారులుగానే కొనసాగుతున్నారు. గిరిజన విద్యాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించేందుకు నియమించిన ఏజెన్సీ డీఈవో పోచం ఇన్‌చార్జి బాధ్యతలను నిర్వహిస్తున్నారు. ఫలితంగా ఆయా శాఖల ఆధ్వర్యంలో జరగాల్సిన అభివృద్ధి కార్యక్రమాలు ముందుకు సాగడం లేదు. ఇరు శాఖల బాధ్యతలతో అధికారులు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. గిరిజనుల అభివృద్ధికి రూపొందించాల్సిన ప్రణాళికలు కూడా రూపుదిద్దుకోవడం లేదు.



ఉట్నూర్‌లోని ఐటీడీఏ కార్యాలయం

● అందని పూర్తిస్థాయి సేవలు

అధికారుల కొరతతో గిరిజనులకు అత్యవసర సేవలు అందడం లేదు. ఇప్పటికే మైనర్ ఇరిగేషన్ శాఖను ఎత్తి వేయడంతో గిరిజన రైతులకు సాగునీటి సౌకర్యం అందక ఇబ్బందులు పడుతున్నారు. అయితే, అత్యవసరంగా అందాల్సిన వైద్య సేవలు కూడా అందడం లేదని తెలుస్తోంది. ప్రతియేటా సీజనల్ వ్యాధుల బారీన పడి పదుల సంఖ్యలో గిరి మరణాలు సంభవిస్తూనే ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా కేవలం 8 మంది వైద్యులు మాత్రమే ఉండగా మిగితా 19 మంది వైద్యులు కాంట్రాక్ట్ పద్ధతిలోనే పని చేస్తున్నారు. అందుకే గత యేడాదిగా మాతా శిశు మరణాల సంఖ్య కూడా పెరుగుతూ వస్తుంది. గిరిజనుల అభివృద్ధికి గత ప్రభుత్వాలు ఎన్నో ప్రయత్నాలు చేయగా స్వరాష్ట్రంలోనే ఐటీడీఏ పాలన ప్రశ్నార్థకంగా మారుతుంది. నిత్యం వివిధ పనులపై ఐటీడీఏ కార్యాలయానికి వచ్చే గిరిజనులకు అధికారులు అందుబాటులో ఉండక అవస్థలు పడాల్సి వస్తోంది.

● చుట్టపు చూపుగా పీవో

ఐటీడీఏ పీవోగా పని చేసిన ఆర్వీ కర్ణన్ మంచిర్యాల జిల్లా కలెక్టర్‌గా నియమకం కావడంతో అప్పటి నుంచి ఇన్‌చార్జి పీవో హోదాలో ఐటీడీఏకు చుట్టపు చూపుగా వచ్చి పోతున్నట్లు విమర్శలు వస్తున్నాయి. కలెక్టర్ బాధ్యతలతో పాటు అదనంగా ఐటీడీఏ బాధ్యతలు పెరిగి పోవడంతో సమర్థవంతమైన సేవలకు ఆటంకాలే ఏర్పడుతున్నాయి. దీంతో నెలలో ఒకటి రెండు సార్లు అలా వస్తు ఇలా వెళ్లి పోవడంతో ఐటీడీఏ పాలన పూర్తిగా పట్టుతప్పుతుంది. గత రెండు మాసాల క్రితం ఉద్యానవన శాఖ అధికారి అక్రమాలకు పాల్పడడంతో సస్పెన్షన్‌కు కూడా గురయ్యాడు. ఐటీడీఏలో అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనడానికి ఇదే ఉదాహరణగా చెప్పుకోవచ్చు. కార్యాలయంలో ఉద్యోగులు సమయపాలన పాటించక పోయిన అడిగే నాథుడే కరువవుతున్నాడు. ఇకనైనా ప్రభుత్వం పూర్తిస్థాయిలో అధికారిని నియమించి ఐటీడీఏ పాలనను గాడిలో పెట్టాలని గిరిజనులు కోరుతున్నారు.

(- ఆంధ్రజ్యోతి, ఆదిలాబాద్)

ఎంఆర్ టీకాతో ఆరోగ్యవంతమైన సమాజం

◆ సోఫీనగర్ రెసిడెన్షియల్‌లో టీకాల కార్యక్రమాన్ని ప్రారంభించిన మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి

నిర్మల్ టౌన్: 9నెలల నుంచి 15సంవత్సరాల్లోపు చిన్నారులకు తట్టు, రుబెల్లా లాంటి ప్రాణంతాక వ్యాధులు సోకకుండా ఉడేందుకు ఎంఆర్ టీకా వేయించి ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పాటుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని రాష్ట్ర గృహనిర్మాణ, దేవాదాయ, న్యాయశాఖల మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని సోఫీనగర్ బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలో పిల్లలకు తట్టు, రుబెల్లా టీకా వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి అల్లోల మాట్లాడుతూ గతంలో పోలియో వ్యాధి నిర్మూలనకు కృషి చేసినట్లే తట్టు, రుబెల్లా వ్యాధుల నుంచి కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరు తమ 9 నెలల నుంచి 15 సంవత్సరాల్లోపు పిల్లందరికీ ఎంఆర్ టీకాలు వేయించాలని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వైద్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. 100 శాతం పిల్లలకు టీకాలు వేయించి ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పాటుకు అందరు కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా జిల్లాస్థాయిలో తట్టు, రుబెల్లాపై నిర్వహించిన ఉపన్యాస, వక్తృత్వ, వ్యాసరచన, చిత్రలేఖనం పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు సర్టిఫికేట్లను అందించారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ అధికార ప్రతినిధి వేణుగోపాల చారి మాట్లాడుతూ 15 సంవత్సరాల్లోపు పిల్లలందరికీ పెద్ద ఎత్తున తట్టు, రుబెల్లా టీకాలు వేయించడం జరుగుతుందన్నారు. కేసీఆర్ కిట్ ద్వారా 32 వస్తువులు, మందులు ఇవ్వడం జరుగుతుందన్నారు. అలాగే 6వ తరగతి నుంచి 12వ తరగతి వరకు ఆంగ్ల మాధ్యమం విద్యనందించేందుకు 500 రెసిడెన్షియల్ పాఠశాలలు బీసీ, మైనార్టీల కోసం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సన్నబియ్యంతో భోజనం అందించి కార్పొరేట్ స్థాయిలో ఉచిత విద్యాబోధన ప్రభుత్వం చేస్తుందన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఇలంబరిది మాట్లాడుతూ దేశంలో రెండవ దశలో 8 రాష్ట్రాల్లో ఈ కార్యక్రమం ఆగస్టు 17 నుంచి సెప్టెంబర్ 25 వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలో 9 నెలల నుంచి 15 సంవత్సరాల్లోపు పిల్లలు 1,84,280 మంది ఉండగా.. ఇప్పటి వరకు 414 పాఠశాలల్లో 58286 మంది విద్యార్థులకు అంటే 31శాతం తట్టు, రుబెల్లా టీకాలను వేయడం జరిగిందన్నారు. సెప్టెంబర్ 15వరకు 95శాతం పూర్తి చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ పార్లమెంట్ సభ్యులు రమేష్ రాథోడ్, జిల్లా జాయింట్ కలెక్టర్ సీహెచ్ శివలింగయ్య, ఏఎంసీ చైర్మన్ దేవేంధర్ రెడ్డి, ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మన్ రాంకిషన్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి, ఆర్డీఓ ప్రసునాంబ, మున్సిపల్ కమిషనర్ త్రియంబకేశ్వర్‌రావు, డీఎం అండ్ హెచ్‌వో జలపతి నాయక్, డీఐవో రాము, డాక్టర్ చక్రధర్, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి

● సకాలంలో వరినాట్లు వేసుకోవాలి..

సారంగాపూర్: సకాలంలో వరినాట్లు వేసుకోవాలని రాష్ట్ర గృహనిర్మాణ, దేవాదాయ, న్యాయశాఖల మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని స్వర్ణ ప్రాజెక్టు చెందిన జెవులినాళ కాలువ ద్వారా 31 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎగువ ప్రాంతమైన మహరాష్ట్రలో కురిసిన వర్షానికి ప్రాజెక్టులోకి 1179.1 అడుగుల నీరు చేరడం వల్ల జెవులినాళ ద్వారా నీరును విడుదల చేశారు. సాగునీరు వృథా చేయకుండా నీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వేసిన పంటలకు అధిక దిగుబడులు వచ్చేలా రైతులు కృషి చేయాలన్నారు. అలాగే ధని గ్రామంలో గొల్ల కుర్మలకు గొర్రెలను పంపిణీ చేశారు. గొర్రెలను సంవృద్ధి చేసుకొని గొల్ల కుర్మలు లబ్ధిపొందాలన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు గొల్ల కుర్మలను దృష్టిలో ఉంచుకొని ఈ పథకాన్ని ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డికి గొల్లకుర్మలు గొంగడిని కప్పి గొర్రె పిల్లను అందించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మన్ రాంకిషన్ రెడ్డి, ఏఎంసీ చైర్మన్ రాజ్ మహ్మద్, అడెల్లి పోచమ్మ దేవస్థానం చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, సర్పంచ్ మర్రి లక్ష్మీ, ఆర్డీవో ప్రసునాంబ, మండల ఉపాధ్యక్షుడు సోమిరెడ్డి నారాయణ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ అయిటి రమేష్, ఎస్ఈ శ్రీనివాస్, ఈఈ రమేష్, డీఈ అనిల్, జెఈ శ్రీకాంత్, శుభ కిషోర్, పార్టీ ఉపాధ్యక్షుడు వడ్డె రాజేందర్ రెడ్డి, నాయకులు పాకాల రాజు, మల్లేష్, నల్ల వెంకట్ రాంరెడ్డి, జీవన్‌రావు, ఊట్ల రాజేశ్వర్, రైతులు, తదితరులున్నారు.

మంత్రిని గొంగడితో సన్మానించి గొర్రె పిల్లను అందజేస్తున్న దృశ్యం


పునరుజ్జీవంపై ప్రజాభిప్రాయ సేకరణ

● నేడు నిర్మల్‌కు రానున్న కాలుష్య మండలి సభ్యులు

ఆంధ్రజ్యోతి, నిర్మల్: ఎస్సారెస్పీ పునరుజ్జీవ పథకంలో భాగంగా నిర్మల్, ముథోల్ నియోజకవర్గాల్లో నిర్మిస్తున్న హైలేవల్ కెనాల్‌లకు సంబంధించి గురువారం కాలుష్య నియంత్రణ మండలి ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టనుంది. నిర్మల్, ముథోల్ నియోజకవర్గాలకు సంబంధించి స్థానిక ప్రజాప్రతినిధులు ఈ ప్రజాభిప్రాయ సేకరణలో పాల్గొననున్నారు. దీని కోసం గాను ఎస్సారెస్పీ, ఇరిగేషన్ అధికారులు ఆయా గ్రామాల్లో పెద్దఎత్తున ప్రచారం నిర్వహించారు. ఈ రెండు హైలెవల్ కెనాల్ నిర్మాణాల ద్వారా పర్యావరణానికి చేకూరే కాలుస్య సమస్యలపై ఈ ప్రజాభిప్రాయ సేకరణలో ప్రజలు తమ అభిప్రాయాలను వెల్లడించనున్నారు. ఈ ప్రజాభిప్రాయాలను సేకరించిన తరువాత సంబంధిత అధికారులు ప్రత్యేక నివేదికను రూపొందించి ఆ నివేదికను కాలుష్య మండలికి అందించనున్నారు. ఈ నివేదికను పరిశీలించిన అనంతరం కాలుష్య నియంత్రణ మండలి అనుమతులు జారీ చేయనున్నారు. ఈ అనుమతుల ఆధారంగానే నిర్మాణ పనులు కొనసాగాల్సి ఉంటుంది. అయితే ప్రజాభిప్రాయ సేకరణ కోసం సంబందిత అధికారులు భారీ ఎత్తున ఏర్పాట్లు చేయడమే కాకుండా సంబందిత రైతులను రప్పించేందుకు చర్యలు చేపడుతున్నారు.

ఉపాధిలో అవినీతి పాల్పడితే చర్యలు : డీఆర్‌డీవో

● 15మంది మేట్‌ల తొలగింపు, ఇద్దరు టీఏలకు షోకాజ్ నోటీసులు

● ముథోల్ ప్రజావేదికలో రూ.44,161 రికవరీ, రూ.25,885 పెనాల్టీ

ముథోల్: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న సిబ్బంది అవినీతికి పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని డీఆర్‌డీవో వెంకటేశ్వర్లు అన్నారు. మండల కేంద్రమైన ముథోల్‌లోని మండల అభివృద్ధి కార్యాలయ ఆవరణలో బుధవారం ప్రజావేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో జూన్ 2016 నుంచి మే 2017 వరకు రూ. మూడు కోట్ల 99 లక్షల జాతీయ ఉపాధి హామి పనులపై తొమ్మిదవ సామాజిక తనిఖీ బృందం సేకరించిన వివరాలను ప్రజావేదికలో వెల్లడించారు. పనులలో నిర్లక్ష్యం, తక్కువ పనికి ఎక్కువ డబ్బులు చెల్లించడం, జాబు కార్డులను అబ్‌డేట్ చేయకపోవడం, రికార్డులను సక్రమంగా నమోదు చేయకపోవడం, పని చేయకపోయిన డబ్బులు చెల్లించడం, తదితర వాటి వివరాలు బహిర్గతమయ్యాయి. అయితే పనులలో నిర్లక్ష్యం వహించిన 15 మందిని మేట్ తొలగించడంతో పాటు ఇద్దరు టెక్నికల్ అసిస్టెంట్‌లకు షో కార్డు నోటీసులు జారీ చేసినట్లు డీఆర్‌డీవో వెల్లడించారు. అలాగే సంబంధిత పనులలో నిర్లక్ష్యం వహించిన టీఏలు, ఎఫ్ఏలకు రూ.44,161 రికవరీ, రూ. 25,885 పెనాల్టీ వేశారు. 10వేల మ్యండేజ్‌ను పూర్తి చేయని సిబ్బందిని ఇంటికి పంపిస్తామని హెచ్చరించారు. ముథోల్, బాసర మండలాలను కలిపి ఈ ప్రజావేదికను నిర్వహించారు. ఓని గ్రామ పంచాయతీకి రూ. 4,594 చింతకుంటకు రూ.4663, ఆష్టాకు రూ. 2495, ముద్గల్‌కు రూ. 10851, సావర్‌గాం రూ. 7454, బోరిగాంకు రూ. 3943, ఎడ్‌బిడ్‌కు రూ. 8357, కౌటకు రూ.5397, విఠోలికు రూ.1299, గన్నోర రూ.1576, టాక్లి రూ.1000, బ్రహ్మన్‌గాం రూ. 1929, కిర్గుల్ రూ.1114, చించాలకు రూ.3073, తరోడ రూ. 2350. రాంటేక్ రూ. 4705, కారే గాం రూ.1122, ముథోల్ రూ. 1122, రికవరికి ఆదేశించినట్లు ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నూర్ మహ్మద్, ఏపీవో సదానందచారి, పీఏసీఎస్ చైర్మన్ సురేందర్ రెడ్డి, ఎంపీపీ అనూశాసాయిబాబా, ఎఫ్‌పీఎం దత్తు, ఎస్సార్పీలు, రాము, రవి, తదితరులు పాల్గొన్నారు.


వివరాలను వెల్లడిస్తున్న సిబ్బంది

సమస్యలు పరిష్కరించాలని బీడీ కార్మికుల ఆందోళన

● బీడీ ఫ్యాక్టరీ ముట్టడి, నిరసన ప్రదర్శనలు ● నిర్వాహక ప్రతినిధుల నిలదీత, వాగ్వాదం

భైంసా: యాజమాన్యం అనుసరిస్తున్న బాధ్యతారాహిత్య వైఖరి విధానాలు, నిర్లక్ష్యపూరిత దోరణి విధానాల మూలంగా ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి భైంసా పట్టణ పరిధిలోని బీడీ కార్మికులు బుధవారం ఆందోళన బాట పట్టారు. ఉదయం వేళలో శివాజీ బీడీ ఫ్యాక్టరీ పరిధిలోని బీడీ కార్మికులు తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ పట్టణ పరిధిలోని వివిధ కాలనీల నుంచి నిరసన ప్రదర్శనలు నిర్వహిస్తూ ర్యాలీగా ఫ్యాక్టరీకి తరలివెళ్లారు. ప్రవేశ మార్గం వద్ద యాజమాన్యం తీరును నిరసిస్తూ వ్యతిరేక ప్రదర్శనలు నిర్వహించి నినాదాలు చేస్తూ భైఠాయించారు. ఫ్యాక్టరీ నిర్వాహకులు సరియైన రీతిలో స్పందించకపోవడంతో వారందరూ లోనికి దూసుకవెళ్లి నిర్వాహకులను నిలదీస్తూ వాగ్వాదానికి దిగారు. పూర్తిస్థాయిలో పని కల్పించకపోవడం మూలంగా తమకు ఉపాధి కరువై కుటుంబ జీవన పరిస్థితులు అగమ్యగోచరంగా మారాయని వాపోయారు. సరిపోయేంతగా ఆకు, తంబాకు అందివ్వకపోవడం మూలంగా తాము కష్ట, నష్టాల పాలవుతున్నామని అవేదన వ్యక్తం చేశారు. నాణ్యతమైన బీడీ పేరిట వేధింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. చాటన్ పేరిట అక్రమాలు, అన్యాయాలకు పాల్పడుతూ కార్మికుల శ్రమను దోపిడీ చేస్తున్నారని విమర్శించారు. యాజమాన్యం అనుసరిస్తున్న విధానాల మూలంగా కార్మికులకు ప్రతీనెల అర శాతం కూడా ఉపాధి దొరకడం లేదని వాపోయారు. సంబంధిత సమస్యలు పరిష్కరించేంత వరకు తాము కదలబోమని ఫ్యాక్టరీ లోపలి భాగంలో కార్మికులు భీష్మించుకొని కూర్చుండిపోయారు. సముదాయించేందుకు యత్నించిన ఫ్యాక్టరీ నిర్వాహకులపై కార్మికులు తీవ్ర స్థాయిలో ఆగ్రహావేశాలు వ్యక్తం చేశారు. వాగ్వాదానికి దిగి నిలదీశారు. ఆందోళన విషయం తెలుసుకున్న బీడీ కామ్‌గార్ యూనియన్ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్తన్న ఫ్యాక్టరీకి చేరుకొని కార్మికులకు మద్దతుగా యాజమాన్యాన్ని, నిర్వహకులను నిలదీశారు. కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని వారు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఇందుకు స్పందించిన యాజమాన్యం త్వరితగతిన సమస్యలను పరిష్కరించేందుకు కృషిచేస్తామని వెల్లడించడంతో కార్మికులు శాంతించి ఆందోళనలను విరమించారు.


భైంసాలో ఆందోళన చేస్తున్న బీడీ కార్మికులు

అడవి పందుల బీభత్సం

పెంబి: రైతులు సాగు చేస్తున్న పంటలపై దెబ్బమీద దెబ్బ పడుతోంది. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో వర్షలు కురుస్తున్న వర్షలకు రైతులు ఉత్సాహంతో పంటలు పండిస్తే అడవి పందులు, చిలుకలు వాటిని నాశనం చేస్తున్నాయి. మొక్కజొన్నతో పాటు పసుపు పంటను తొక్కేస్తున్నాయి. దీంతో రైతులు మొక్కజొన్న పంట కోతదశకు రాకముందే కోసేస్తున్నారు. దాన్నే రైతులు పశువులకు మేతగా వాడుకుంటున్నారు. దీంతో రైతులకు మరింత నష్టం చేకూరుతోంది. అడవి పందుల నివారణకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని రైతన్నలు డిమాండ్ చేస్తున్నారు. పెంబి మండలంలో వివిధ గ్రామాల్లో రైతులు సుమారు 6వేల ఎకరాల్లో మొక్కజొన్న పంటను సాగు చేస్తున్నారు. అందులో సగబాగంపైగా పసుపు పంటతో పాటు మొక్కజొన్నను మిశ్రమ పంటగసాగు చేయగా పెంబి, మందపల్లి, ఇటిక్యాల్, పస్పుల, తాటిగుడ, వెంకంపోచంపాడ్, శెట్‌పల్లి, లోతర్య, ఇటిక్యాల్ తండా, అంకెన, ఎంగ్లాపూర్, గుమ్మెన, తదితర గ్రామాల్లో అడవిపందులు బీభత్సవం సృష్టిస్తున్నాయి. మొక్కజొన్న పంటలను నాశనం చేస్తున్నాయి. గుంపులుగా వచ్చిన అడవి పందులు ప్రతిరోజు ఒకరైతులకు చెందిన అర ఎకరం నుంచి ఎకరం వరకు పంటలను నేలపాలు చేస్తున్నాయి. మొక్కజొన్న పంట కంకుల దశకు చేరడంతో అడవి పందులు ఇష్టంతో వాటిని కొరికి వేస్తున్నాయి. మొక్కజొన్న పంటలో పసుపు మిశ్రమపంటగా ఉండడంతో వాటిని తొక్కిస్తున్నాయి. పసుపు పంటను కాపాడు కోవడానికి కోత దశకు చేరని మొక్కజొన్న పంటను ముందస్తుగానే రైతులు కోసేస్తున్నారు. పసుపులకు మేతగా వాడుకుంటున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి అడవి పందుల నివారణకు చర్యలు చేపట్టాలని ఆయా గ్రామాల రైతులు డిమాండ్ చేస్తున్నారు.


ఇటిక్యాల్ తండాలో ధ్వంసమైన పసుపు, మొక్కజొన్న పంటలు

ఆయు(ష్)వు లేని కేంద్రాలు

- అరకొర సిబ్బందితో అందని సేవలు
- నామమాత్రంగా మందుల సరఫరా
- పర్యవేక్షణ కరువు
- ఆయుష్ కార్యకలాపాలు

మంచిర్యాల టౌన్: అల్లోపతి వైద్యానికి ప్రత్యామ్నాయంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఏవైయూఎస్‌హెచ్ (ఆయుర్వేద, యోగా నేచురోపతి, యునాని, సిద్ద, హోమియోపతి) కేంద్రాలు జిల్లాలో నిర్జీవంగా మారుతున్నాయి. ఆయుష్ ఆసుపత్రులపై సరియైన పర్యవేక్షణ లేక రోగులకు వైద్యం అందని ద్రాక్షలా మారింది. సిబ్బంది కొరత కారణంగా ఆయుష్ కేంద్రాలు ఆశించిన ఫలితాన్ని ఇవ్వడం లేదు. 1995లో కేంద్ర ప్రభుత్వం ఐఎస్‌ఎంహెచ్ (ఇండియన్ సిస్టమ్ ఆఫ్ మెడిసిన్ అండ్ హోమియోపతి) విభాగాన్ని ఏర్పాటు చేసింది. అనంతరం 2003 నవంబర్‌లో ఆయుష్‌గా నామకరణం చేశారు. ప్రధాని నరేంద్రమోదీ ప్రత్యేక శ్రద్ధతో 2014 నవంబర్ 9న ఆయుష్‌ను మరింతగా పటిష్టం చేసేందుకు ప్రత్యేకంగా మంత్రిత్వశాఖను ఏర్పాటు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అజమాయిషీలో ఆయుష్ కేంద్రాలు పని చేయాల్సి ఉంటుంది. అయితే ప్రభుత్వ ప్రణాళికకు భిన్నంగా మంచిర్యాల జిల్లాలో కార్యకలాపాలు కొనసాగుతున్నాయి.

● డిస్పెన్సరీలకు భవనాలు కరువు...

జిల్లాలో ఆయుష్‌కు సంబంధించి 9 ఆయుర్వేద, 3 యునాని రెగ్యులర్ డిస్పెన్సరీలు ఉన్నాయి. వీటితోపాటు ఎన్‌ఆర్‌హెచ్‌ఎం(నేషనల్ రూరల్ హెల్త్ మిషన్), యోగా నేచురోపతి ఆసుపత్రుల్లో రోగులకు వైద్య సేవలందుతున్నాయి. హోమియోపతికి సంబంధించి జిల్లాలో ఒక్క ఆసుపత్రి కూడా లేకపోగా ఉన్న డిస్పెన్సరీలు కూడా సొంత భవనాలులేక ఆయా ప్రాంతాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో కొనసాగుతున్నాయి. జిల్లా కేంద్రానికి అత్యంత సమీపంలో ఉన్న నస్పూర్ ఆయుష్ కేంద్రానికి సొంత స్థలం ఉన్నా అందులో భవన నిర్మాణానికి మోక్షం లభించడం లేదు. స్థానిక పీహెచ్‌సీకి సమీపంలో ఆయుష్ కేంద్రం కోసం 4 గుంటల స్థలాన్ని కేటాయించారు. జిల్లా కేంద్రంలోనే ఆయుష్ పరిస్థితి ఇలా ఉంటే ఇతర ప్రాంతాల్లోని కేంద్రాల స్థితిగతులు ఎలా ఉంటాయో ప్రత్యేకంగా చెప్పనక్కర లేదు. జిల్లాలోని నస్పూర్, జన్నారం, తపాల్‌పూర్, కాసిపేట, నీల్వాయి, మందమర్రి, దేవాపూర్, తాండూర్, కన్నెపెల్లిలో ప్రభుత్వ ఆయుర్వేద డిస్పెన్సరీలు ఉన్నాయి. యునానికి సంబంధించి చెన్నూర్, నెన్నెల, బెల్లంపల్లిలో డిస్పెన్సరీలు ఉన్నాయి. వీటికి ఎక్కడాకూడా పక్కా భవనాలు లేకపోవడం గమనార్హం.



ఆయుష్ కేంద్రంలో అరకొరగా ఉన్న మందులు

● అరకొర సిబ్బంది....

ఆయుర్వేద డిస్పెన్సరీల్లో వైద్యుడు, ఫార్మాసిస్టు, అటెండర్ తప్పనిసరిగా విధులు నిర్వహించాల్సి ఉంటుంది. అయితే జిల్లాలోని చాలా డిస్పెన్సరీల్లో రెండు పోస్టులు ఖాళీగా ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో రోగులకు సరియైన వైద్యం లభించడం లేదు. జన్నారంలో వైద్యుడు, ఫార్మాసిస్టు మాత్రమే ఉన్నారు. అలాగే తపాల్‌పూర్‌లో ఫార్మాసిస్టు లేడు. కోటపల్లిలో అటెండర్ పోస్టు ఖాళీగా ఉండగా నీల్వాయి, మందమర్రిలలో వైద్యులు లేకపోవడంతో ఫార్మాసిస్టు, మేల్ నర్సు వైద్య సేవలందిస్తున్నారు. దేవాపూర్‌లో అటెండర్ లేకపోగా తాండూర్‌లో ఫార్మాసిస్టులేడు. కన్నెపల్లిలో వైద్యుడు ఒక్కరే ఉండటం గమనార్హం. అలాగే యునాని వైద్యశాలల్లో చెన్నూర్, నెన్నెల డిస్పెన్సరీలలో పూర్తిస్థాయి వైద్య సిబ్బంది ఉండగా బెల్లంపల్లి యునాని వైద్యశాలలో కేవలం కాంపౌండరే చికిత్స అందిస్తున్నారు. ఇదిలా ఉండగా యోగా నేచురోపతికి సంబంధించి జిల్లాలో కేవలం జైపూర్ మండలంలోనే డిస్పెన్సరీ ఉంది. అయితే ఇందులో వైద్యురాలు సెలవుపై వెళ్లడంతో యోగాపై అవగాహన క్యాంపులు మరుగునపడి ఆయుష్‌కు ప్రజలు దూరంగా ఉండవలసిన పరిస్థితులు నెలకొన్నాయి. నస్పూర్ మెడికల్ ఆఫీసర్ ఆర్ జగన్మోహన్‌కు అదనంగా నీల్వాయి, మందమర్రి, చెన్నూర్, బెల్లంపల్లి, నెన్నెలతో పాటు కుమరంభీం జిల్లాలోని ఆసిఫాబాద్ మండలం చిర్రకుంట డిస్పెన్సరీల బాధ్యతలు అప్పగించారు. దీంతో పర్యవేక్షణ కొరవడి ఆశించిన లక్ష్యం నెరవేరడం లేదు.

● చాలీచాలని వేతనాలతో ఇబ్బందులు..

ఆయుష్‌తోపాటు నేషనల్ రూరల్ హెల్త్ మిషన్ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఇందులో పనిచేసే వైద్యులు, ఇతర సిబ్బందికి ఆయుష్ మాదిరిగా వేతనాలు ఉండవు. ఎన్‌ఆర్‌హెచ్‌ఎంలో పనిచేసే వైద్యుడికి నెలసరి వేతనం రూ. 20వేల వరకు ఉండగా, ఫార్మాసిస్టుకు రూ. 10వేలు, నర్సులకు రూ. 7030 ఉండగా సిబ్బంది సంఖ్య సరిపడా లేక ఉన్నవారిపై అదనపు భారం పడుతోంది. వేతనాలు కూడా సక్రమంగా అందకపోవడంతో ఎన్‌ఆర్‌హెచ్‌ఎం సిబ్బంది తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. జిల్లాలో ఎన్‌ఆర్‌హెచ్ పథకం కింద తాళ్లపేట, లక్షెట్టిపేట, కుందారం, బెల్లంపల్లిలలో ప్రభుత్వ ఆయుర్వేద డిస్పెన్సరీలు ఉన్నాయి. అలాగే హోమియో వైద్యానికిగాను హాజీపూర్, చెన్నూర్, కాసిపేట మండలాల్లో ప్రభుత్వ వైద్యశాలలున్నాయి. యునానికి దండేపల్లి, వెంకట్రావ్‌పేటలో వైద్యశాలలు ఉన్నాయి.

● పర్యవేక్షణ లోపం....

ఆయుష్ వైద్య చికిత్సపై ఉన్నతాధికారుల పర్యవేక్షణలేక వైద్యం కుంటుపడుతోందనే ఆరోపణలున్నాయి. ఆయుష్‌కు సంబంధించి జిల్లాలో పర్యవేక్షణాధికారి లేరు. వరంగల్‌లోని ఆయుష్ రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ ఎం.వి జయ్‌కుమార్ ఒక్కరే చాలా జిల్లాల ఆయుష్ కేంద్రాలను పర్యవేక్షించాల్సి వస్తోంది. దీంతో సిబ్బంది సైతం నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఇప్పటికైనా జిల్లాకు ప్రత్యేకంగా పర్యవేక్షణ అధికారి నియమించి ఆయుష్ కేంద్రాలను గాడిలో పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

బడ్జెట్ కేటాయించాలి...

-జగన్మోహన్, నస్పూర్ మెడికల్ ఆఫీసర్



ఆయుష్ కేంద్రాల్లో స్టేషనరీ కొనుగోళ్లు, ఇతరత్రా ఖర్చుల కోసం ప్రభుత్వం అవసరమైన బడ్జెట్‌ను కేటాయించాలి. డిస్పెన్సరీలకు స్వంత భవనాలులేని కారణంగా పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందడం లేదు. పక్షవాతం, ఇతరత్రా వ్యాధుల చికిత్స కోసం ఆసుపత్రుల్లో బెడ్ సౌకర్యం కల్పించాలి.



నస్పూర్‌లో ఆయుష్ వైద్యశాల కొనసాగుతున్న పీహెచ్‌సీ భవనం

మృత్యుకుహరం

- ప్రమాదాలకు నిలయంగా ఖానాపూర్-తర్లపాడ్ రహదారి
- నెల రోజుల వ్యవధిలో ఇద్దరు మృతి
- మిషన్ భగీరథ తవ్వకాలతో ఇక్కట్లు
- నాలుగు నెలలుగా తొలగించని మట్టి కుప్పలు
- ఒక వైపు మట్టితో మూసుకుపోయిన రోడ్డు
- పట్టించుకోని అధికారులు

ఖానాపూర్: నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండల కేంద్రం నుంచి తర్లపాడ్ వెళ్లే రహదారి మృత్యు కుహరంగా తయారైంది. నెల రోజుల వ్యవధిలోనే ఐదు రోడ్డు ప్రమాదాలు జరిగి ఇద్దరు మృతి చెందగా మరో ఇద్దరు తీవ్ర గాయాలపాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఖానాపూర్ నుంచి పెంబి మండలంతో పాటు కడెం, జన్నారం, లక్షెట్టిపేట్ మీదుగా మంచిర్యాల వైపు వెళ్లే వాహనాలన్నీ ఈ రహదారి మీదుగానే వెళ్లాల్సి ఉంటుంది. ఖానాపూర్ నుంచి తర్లపాడ్ వరకు కేవలం మూడు కిలో మీటర్ల దూరం మాత్రమే ఉన్న ఈ రోడ్డు ఏళ్లు గడుస్తున్నా వెడల్పునకు నోచుకోలేదు. ఖానాపూర్ నుంచి తర్లపాడ్ వెళ్లే రహదారి వెంబడి రోడ్డు పక్కన మట్టి కుప్పలు ప్రమాదకరంగా ఉన్నాయి. దాదాపు నాలుగు నెలల క్రితం కడెం నుంచి ఖానాపూర్‌కు నీరు తెచ్చేందుకు మిషన్ భగీరథ పథకంలో భాగంగా అధికారులు రోడ్డు పక్కన తవ్వకాలు చేపట్టి పైపులైను వేశారు. ఈ పైపు లైను వేసిన అనంతరం కొన్ని చోట్ల మట్టిని పూడ్చలేదు. దీంతో తర్లపాడ్ నుంచి ఖానాపూర్ వచ్చే రోడ్డు వెంబడి చాలా చోట్ల మట్టికుప్పలు అలాగే ఉన్నాయి. ఈ మట్టి కుప్పలు ఉండడంతో పాటు రోడ్డు చిన్నదిగా ఉండడం ప్రమాదాలకు కారణం అవుతోంది. ఖానాపూర్ మార్కెట్ యార్డు వద్ద రోడ్డు పక్కన నిలిచి ఉంటున్న నీటిని తొలగించేందుకు రాజీవ్ చౌక్ సర్కిల్ వద్ద కల్వర్టు నిర్మించారు. ఈ పనులు ముగించుకున్న కాంట్రాక్టరు తన పని ముగించుకుని రోడ్డు పక్కన పోసిన మట్టిని తొలగించలేదు. దీంతో ఈ సర్కిల్‌లో రెండు వైపుల నుంచి ఉన్న రహదారి ఒక వైపు దాదాపుగా మూసుకుపోయింది. దీంతో తరుచుగా ప్రమాదాలు జరుగుతున్నాయి.



ఈనెల 11వ తేదిన జరిగిన రోడ్డు ప్రమాదంలో సంఘటన స్థలంలో క్షతగాత్రులు (ఫైల్)

● వరుస ప్రమాదాలు..

ఖానాపూర్ - తర్లపాడ్ రహదారి వెంట నెల రోజుల వ్యవదిలోనే ఐదుకు పైగా ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. మూడు ప్రమాదాల్లో వాహన దారులు చిన్న చిన్న గాయాలతో బయటపడగా రెండు ప్రమాదాల్లో మాత్రం ఇద్దరు వ్యక్తులు మృతి చెందగా మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ నెల 11వ తేదిన ఖానాపూర్ రాజీవ్‌చౌక్‌లో రెండు ద్విచక్రవాహనాలు ఢీకొనడంతో పెంబి మండలం పస్పుల అటవీశాఖ బీట్ అధికారి ముస్తాక్, తర్లపాడ్ గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవరు రవిలకు తీవ్ర గాయాలయ్యాయి. ప్రస్తుతం వీరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ నెల 12వ తేదిన జరిగిన రోడ్డు ప్రమాదంలో కత్తెర ప్రశాంత్, బత్తుల శ్రీకాంత్ అనే ఇద్దరు యువకులు మృతి చెందారు. రోడ్డు చిన్నదిగా ఉండడం, రోడ్డు పక్కన మట్టి కుప్పలు ఉండడం వాహనదారుల పాలిట శాపంగా మారుతుంది. ఓ వైపు మట్టి కుప్పలుండడంతో వెగంగా వచ్చే వాహనాలు అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్థంబాలు, చెట్లను ఢీ కొంటున్నాయని ఇప్పటికైన అధికారులు స్పందించి రోడ్డు వెడల్పు పనులు చేపట్టే వరకైన రోడ్డు పక్కన ఉన్న మట్టికుప్పలను తొలగించి తాత్కలికంగా రక్షణ చర్యలు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.



ఖానాపూర్-తర్లపాడ్ రహదారి పక్కన ప్రమాదకరంగా ఉన్న మట్టికుప్పలు

మట్టి కుప్పలు తొలగించడంలో నిర్లక్ష్యం

- నంది రామయ్య, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి



ఖానాపూర్ తర్లపాడ్ రోడ్డు వెంబడి మిషన్ భగీరథ పథకంలో భాగంగా పైపు లైను తవ్వి మట్టి కుప్పలను రోడ్డు పక్కనే నిర్లక్ష్యంగా వదిలేశారు. దీంతో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. రాజీవ్‌చౌక్‌లో పనులు నిర్వహించిన కాంట్రాక్టరు ఇప్పటి వరకు రోడ్డుపై పోసిన మట్టికుప్పలు తీయకపోవడంతో ఒకవైపు రోడ్డు మూసుకుపోయింది. అధికారులు వెంటనే స్పందించి మట్టికుప్పలు తొలగించాలి.

మా గ్రామానికి చెందిన పలువురు ప్రమాదాలకు గురయ్యారు

- గుండేటి నరేష్, వాహనదారుడు, తర్లపాడ్



ఖానాపూర్ నుంచి తర్లపాడ్ వెళ్లే రోడ్డు ప్రమాదకరంగా ఉండడంతో మా గ్రామస్థులు పలువురు గాయపడ్డారు. ఇటీవల జరిగిన ప్రమాదంలో తర్లపాడ్‌కు చెందిన రవి తీవ్రంగా గాయపడి ఇంకా ఆసుపత్రిలోనే చికిత్స పొందుతున్నాడు. అధికారులు స్పందించి రోడ్డు ప్రమాదాలను నివారించేలా చర్యలు చేపట్టాలి.

ఆర్అండ్‌బీ పరిధిలోకి వచ్చింది

- భీమ్‌సింగ్ ఆర్అండ్‌బీ ఏఈఈ, ఖానాపూర్



ఖానాపూర్ నుంచి తర్లపాడ్ వెళ్లే రహదారి సుమారు రెండు నెలల క్రితమే పంచాయతీరాజ్ నుంచి ఆర్అండ్‌బీ పరిధిలోకి తెస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. తాత్కాలిక మరమ్మతులు చేపట్టేందుకు ప్రతిపాదనలు పంపించాం. రోడ్డు వెడల్పు చేసేందుకు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా



మట్టి గణేశుడిని తయారు చేస్తున్న తిరుపతి

మట్టి గణేశుల 'తిరుపతి'



- పదేళ్లుగా వినాయకుల తయారీ
- మట్టి బొమ్మలు, కుండల తయారీలోనూ నేర్పరి

మట్టి గణేశులను వినియోగించాలని

చాలా కాలంగా పర్యావరణ వేత్తలు, స్వచ్ఛంద సంస్థలు ప్రచారం చేస్తున్నాయి. పర్యావరణ పరిరక్షణకు చాలా మంది మట్టి గణేశులను ఉపయోగిస్తున్నారు. వీటిని తయారు చేయడంలో మంచిర్యాల పట్టణానికి చెందిన తిరుపతికి మంచి పేరుంది. అందుకే తిరుపతిని మట్టి గణేశుల తయారీకి కేరాఫ్ అడ్రస్‌గా చెబుతారు. ఆయన మంచిర్యాలలో దశాబ్ద కాలంగా మట్టి గణేషులను తయారు చేస్తున్నాడు. తల్లి సత్తమ్మ, భార్య శైలజ కూడా ఇదే పని చేస్తారు. రసాయనాలు ఉపయోగించకుండా మట్టితో గణపతులను అందంగా తీర్చిదిద్దడంలో తిరుపతి నేర్పరి. గణేశుల సీజన్ అయిపోగానే కుండలు తయారు చేసి అమ్ముతారు. పెళ్లిళ్ల సీజన్‌లోనూ మట్టి బొమ్మలను తయారు చేస్తాడు. తిరుపతి ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ మట్టి బొమ్మలకు, కళాకారులకు ఆదరణ కరువైందని, తమను ప్రోత్సహించాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

◆ ఆంధ్రజ్యోతి, మంచిర్యాల



మట్టి గణేశులను సిద్ధం చేస్తున్న తిరుపతి భార్య శైలజ



చక్రంపై వినాయకుడి విగ్రహాన్ని చేస్తున్న తిరుపతి





తిరుపతి ఇంట్లో తయారు చేసిన వివిధ రకాల మట్టి గణేశులు

సూక్తి

సేవను మించిన ఆనందం లేదు
సంతోషాన్ని మించిన సంపద లేదు

టంగ్ ట్విస్టర్స్

1. Rory the warrior and Roger the worrier were reared wrongly in a rural brewery.
2. Chester Cheetah chews a chunk of cheep cheddar cheese.
3. Real rock wall, real rock wall, real rock wall
4. A gazillion gigantic grapes gushed gradually giving gophers gooey guts.

నవ్వుల్ నవ్వుల్

టీచర్ : ఏ రోజు పని ఆ రోజే చేయడం ఉత్తముల లక్షణం. అర్థమైందా?
బంటు : అర్థమైంది టీచర్. రేపటి హోంవర్క్ రేపే చేయాలి. ఈ రోజు కాదు!
టీచర్ : !!!!!!!!

ఓటమే లేకుండా..

ఏ ఆటలోనైనా గెలుపు-ఓటములు తప్పవు. కానీ కెరీర్ మొదలుపెట్టిన నాటి నుంచి ఒక్క మ్యాచ్ కూడా ఓడిపోకుండా విజయాలు సాధించడం మామూలు విషయం కాదు. పుణేకు చెందిన జూనియర్ గోల్ఫర్ ఆర్యమన్ సింగ్ అదే చేసి చూపించాడు . నాలుగేళ్లుగా విజయాలే సాధిస్తూ దూసుకుపోతున్నాడు. 'ఇండియన్ గోల్ఫ్ యూనియన్- వెస్ట్ జోన్' అందించే 'ఆర్డర్ ఆఫ్ మెరిట్'ను వరుసగా మూడు సార్లు సాధించాడు. జోనల్ లెవల్‌లోనూ, జాతీయ స్థాయిలోనూ ఈ జూనియర్ గోల్ఫర్‌కు తిరుగులేదు. జూనియర్ గోల్ఫ్ చరిత్రలో 1,266 రోజులుగా ఓటమి ఎరుగని అజేయుడిగా నిలిచి సరికొత్త రికార్డు సాధించాడు.



ఆర్యమన్ సింగ్ వయసు పదేళ్లు. ప్రొఫెషనల్ ప్లేయర్‌గా గోల్ఫ్ ఆడటం మొదలెట్టి నాలుగేళ్లు అవుతోంది. జోనల్ లెవల్‌లో ఇంతవరకు ఆర్యమన్‌కు తిరుగులేదు. ఈ ఛోటా గోల్ఫర్ తన కెరీర్‌లో ఒక్క మ్యాచ్‌ను కూడాచేజార్చుకోలేదు. 1,266 రోజులుగా తన విజయ యాత్ర కొనసాగిస్తూ జూనియర్ లెవల్ గోల్ఫ్‌లో సరికొత్త చరిత్ర సృష్టించాడు.

'నా నాలుగో ఏట నుంచి గోల్ఫ్ ఆడటం మొదలుపెట్టాను. రెండు సంవత్సరాల పాటు గోల్ఫ్ సాధన చేశాను. ఆట గురించే ఎప్పుడూ ఆలోచించేవాడిని. జిల్లా, జోనల్, రాష్ట్ర స్థాయుల్లో జరిగే ప్రతి గోల్ఫ్ టోర్నమెంట్‌లో పాల్గోనేవాడిని. అహ్మదాబాద్‌లోని 'కెన్స్‌విల్లే గోల్ఫ్ కోర్సు'లో జరిగిన మ్యాచ్‌లో తొలిసారిగా విజయం సాధించాను. ఆనాటి నుంచి ప్రతి మ్యాచ్‌లోనూ విజయం సాధిస్తూ వస్తున్నాను. మూడేళ్లుగా 'జస్టిన్ పార్కన్స్' నాకు కోచింగ్ ఇస్తున్నాడు. గోల్ఫ్ క్రీడలో పేరుగాంచిన మార్క్ రోయ్, డేవిడ్ స్టాక్టన్, విజయ్ దివెచ వంటి దిగ్గజాల దగ్గర ఎన్నో మెలకువలు నేర్చుకున్నాను. నేనింకా గోల్ఫ్ నేర్చుకునే దశలోనే ఉన్నాను. భవిష్యత్తులో ఈ క్రీడలో మరింత రాణించాలని అనుకుంటున్నాను. నాకు గోల్ఫ్‌తో పాటు క్రికెట్, బ్యాడ్మింటన్, ఫుట్‌బాల్, టెన్నిస్ క్రీడలంటే కూడా ఎంతో ఇష్టం. సమయం చిక్కితే అవి కూడా ఆడుతుంటాను. టీవీ చూస్తాను. స్కూల్‌వర్క్ కంప్లీట్ చేసుకున్న తర్వాతే ఆటలు ఆడతాను'

- ఆర్యమన్



ఔనా!

ఉడుము ఊపిరి తీసుకోకుండా నీటిలో అరగంట పాటు ఉండగలదు.



చుక్కలు కలపండి



మీకు తెలుసా?




58 శాతం మంది మహిళలు ప్రతిరోజూ నెయిల్ పాలిష్ వేసుకుంటారని ఓ అధ్యయనంలో తేలింది.

రంగులు వేయండి



బొమ్మ గీయండి



జంబ్లింగ్ వర్డ్స్


ఈ కింది పదాలను సరిచేయండి

1. KJOE ▸ ....
2. HAET ▸ ....
3. THBA ▸ ....
4. RSHU ▸ ....

చెప్పగలరా?

నాడిలో ఉన్నా కానీ కోడిలో లేను
జూలులో ఉన్నా కానీ జూన్‌లో లేను
గుడిలో ఉన్నా కానీ బడిలో లేను
అయితే ఇంతకీ నేనెవర్నో చెప్పగలరా?

దారి కనుక్కోండి



జవాబులు

చెప్పగలరా? : నాలుగు
జంబ్లింగ్ వర్డ్స్ :
1. JOKE 2. HATE/HEAT 3. BATH 4. RUSH

'బల్గేరియా ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ-2017'విజేత?

1. 2017కి గాను 'మాలతి చందూర్' సాహిత్య పురస్కారానికి ఎంపికైనది?
ఎ) రంగనాయకమ్మ బి) కనపర్తి వరలక్ష్మి
సి) శివరాజు సుబ్బలక్ష్మి
డి) యద్దనపూడి సులోచనరాణి

2. కమ్యూనికేషన్ రంగంలో విశిష్ట సేవలందించి నందుకు 'మార్కోని సొసైటీ జీవన సాఫల్య పురస్కారం-2017'కి ఎంపికైన ఇండో అమెరికన్?
ఎ) థామస్ కైలత్ బి) శంకర్ సుబ్రమణ్యం
సి) వెంకట్రామన్ రామకృష్ణన్
డి) పురుషోత్తందాస్ మహార్

3. ఎకనమిక్స్ ఇంటెలిజెన్స్ యూనిట్ 140 దేశాలపై నిర్వహించిన సర్వేలో 2017కిగాను అత్యంత నివాసయోగ్య నగరంగా తొలిస్థానంలో నిలిచింది?
ఎ) వాంకోవర్(కెనడా) బి) గ్విమాసున్(చైనా)
సి) వియన్నా(ఆస్ట్రియా) డి) మెల్‌బోర్న్(ఆస్ట్రేలియా)

4. షాంఘై ర్యాంకింగ్ కన్సల్టెన్సీ 2017కిగాను ప్రకటించిన 'అకడమిక్ ర్యాంకింగ్స్ ఆఫ్ వరల్డ్ యూనివర్సిటీ' నివేదికలో తొలిస్థానం పొందింది?
ఎ) హార్వర్డ్ యూనివర్సిటీ(అమెరికా)
బి) సింగువా యూనివర్సిటీ(చైనా)
సి) మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (అమెరికా)
డి) టోక్యో యూనివర్సిటీ(జపాన్)

5. 2017 ఆగస్టు 17న రక్షణ శాఖ రూ.4168 కోట్లతో ఆరు అపాచీ హెలికాప్టర్ల కొనుగోలుకు ఆమోదం తెలిపింది. వీటి తయారీ సంస్థ బోయింగ్ ఏ దేశానికి చెందింది?
ఎ) ఇటలీ బి) జర్మనీ సి) అమెరికా డి) ఫ్రాన్స్

6. 'బల్గేరియా ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ-2017' పురుషుల సింగల్స్ విజేత?
ఎ) పీటర్ గ్రేడ్(డెన్మార్క్) బి) లక్ష్యసేన్(ఇండియా)
సి) లిన్‌డాన్(చైనా)
డి) జ్వోనిమిర్ దుర్కిన్‌జాక్(క్రొయేషియా)

7. ఫోర్బ్స్ పత్రిక-2017కిగాను ప్రకటించిన అత్యధిక రెమ్యూనరేషన్ పొందుతున్న హీరోయిన్ల జాబితాలో తొలిస్థానం పొందింది?
ఎ) జెన్నిఫర్ లోపెజ్ బి) జెన్నిఫర్ అనిస్టోన్
సి) అలిసియ వికెందర్ డి) ఎమ్మాస్టోన్

8. ఇండియాటుడే ఇటీవల భారత ప్రధానుల సమర్థతపై 'మూడ్ ఆఫ్ ద నేషన్' పేరిట నిర్వహించిన సర్వేలో 33 శాతం ఓట్లతో అత్యంత సమర్థుడైన ప్రధానిగా నిలిచింది?
ఎ) అటల్ బిహారి వాజ్‌పేయి
బి) జవహర్‌లాల్ నెహ్రూ
సి) ఇందిరాగాంధీ డి) నరేంద్రమోదీ

9. మదర్సాల ఆన్‌లైన్ నమోదుకు ఇటీవల ప్రత్యేక పోర్టల్‌ను ప్రారంభించిన రాష్ట్రం?
ఎ) గుజరాత్ బి) ఉత్తరప్రదేశ్
సి) బిహార్ డి) కేరళ

10. ఇన్ఫోసిస్ ఎం.డి. విశాల్‌సిక్కా రాజీనామాతో తాత్కాలిక ఎం.డి.గా ఎవరు నియమితులయ్యారు?
ఎ) ప్రవీణ్‌రావు బి) సంజయ్ బంగా
సి) సబీర్ భాటియా
డి) విజయ్ శేఖర్ శర్మ

11. తెలంగాణలో తొలి స్మార్ట్ పోలీస్‌స్టేషన్‌ను 2017 ఆగస్టు 18న ఎక్కడ ప్రారంభించారు?
ఎ) జమ్మికుంట(కరీంనగర్) బి) బెజ్జంకి(సిద్దిపేట)
సి) నవిపేట(నిజామాబాద్)
డి) దోమకొండ(నిజామాబాద్)

12. 2017 ఆగస్టు 19న మహిళ భద్రత కోసం తెలంగాణ ప్రభుత్వం ప్రారంభించిన టోల్‌ఫ్రీ నంబరు?
ఎ) 181 బి) 1551 సి) 112 డి) 999



ఎస్.మహిపాల్‌రెడ్డి
సీనియర్ ఫ్యాకల్టీ

జి.కె. అండ్ కరెంట్ అఫైర్స్

13. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ ఫుడ్ అండ్ అగ్రికల్చర్ అందించే 'వ్యవసాయ నాయకత్వ అవార్డు-2017'కి ఎంపికైనది?
ఎ) శివరాజ్‌సింగ్ చౌహాన్(మధ్యప్రదేశ్)
బి) నితిష్ కుమార్(బీహార్)
సి) కె.చంద్రశేఖర్‌రావు(తెలంగాణ)
డి) విజయన్(కేరళ)

14. 2017కి గాను ఫోర్బ్స్ పత్రిక ప్రకటించిన అత్యధిక ఆదాయం గల మహిళ క్రీడాకారుల జాబితాలో తొలిస్థానం పొందింది?
ఎ) సెరెనా విలియమ్స్(టెన్నిస్)
బి) మరియ మజుచికే(చెస్)
సి) పి.వి.సింధు(బ్యాడ్మింటన్)
డి) స్మృతి మంధన(క్రికెట్)

15. 'ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్- 2017'కి ఆతిథ్యమిస్తున్న నగరం?
ఎ) కౌలాలంపూర్(మలేషియా)
బి) గ్లాస్గో(బ్రిటన్) సి) బ్యాంకాక్(థాయ్‌లాండ్)
డి) హంగ్జ్(చైనా)

16. ఎవరి జయంతిని పురస్కరించుకొని ఆగస్టు 20ని 'సద్భావన దివస్'గా నిర్వహిస్తారు?
ఎ) రవీంద్రనాథ్ ఠాగూర్ బి) రాజీవ్‌గాంధీ
సి) ఇందిరాగాంధీ డి) పండిట్ రవిశంకర్

17. భారత నౌకా దళానికి చెందిన ఆరుగురు మహిళ అధికారులు ప్రపంచ యాత్ర లక్ష్యంగా చేపట్టిన 'నావికా సాగర్ పరిక్రమ' ప్రాజెక్టులో ఉపయోగిస్తున్న నౌక?
ఎ) ఐఎన్ఎస్‌వి తరిణి
బి) ఐఎన్ఎస్‌వి మహదేవి
సి) ఐఎన్ఎస్‌వి సింధురక్షక్
డి) ఐఎన్ఎస్‌వి తల్వార్

18. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నూతనంగా విడుదల చేయనున్న రూ.50 నోటుపై ఉన్న చిహ్నం 'సాంస్కృతిక రథాన్ని' ఎక్కడి నుంచి గ్రహించారు?
ఎ) జైపూర్(రాజస్థాన్) బి) హంపి(కర్ణాటక)
సి) శ్రావణబెళగొళ(కర్ణాటక) డి) పింప్రి(మహారాష్ట్ర)

19. 'నికోలాయ్ కుదాషెవ్' ఇటీవల ఏ దేశం తరపున భారత్‌లో రాయబారిగా నియమితులయ్యారు?
ఎ) రష్యా బి) మంగోలియా
సి) కజకిస్థాన్ డి) ఇజ్రాయెల్

20. భారత్‌లో పాకిస్థాన్ నూతన హైకమిషనర్‌గా ఇటీవల ఎవరు నియమితులయ్యారు?
ఎ) అబ్దుల్ బాసిత్ బి) మలీహాలోధి
సి) సొహేల్ మహమ్మద్ డి) రియాల్ షరీఫ్

21. పి.ఆర్.శేషాద్రి ఇటీవల ఏ బ్యాంక్‌కు మేనేజింగ్ డైరెక్టర్‌గా నియమితులయ్యారు?
ఎ) కెనరా బ్యాంక్ బి) లక్ష్మీవిలాస్ బ్యాంక్
సి) బ్యాంక్ ఆఫ్ బరోడా డి) కరూర్ వైశ్యా బ్యాంక్

22. 2017కిగాను 'స్పానిష్ సూపర్ కప్' ఫుట్‌బాల్ టోర్నీ విజేత?
ఎ) రియల్ మాడ్రిడ్ క్లబ్ బి) బార్సిలోనా క్లబ్
సి) ఇంగ్లీష్ ప్రీమియర్ క్లబ్ డి) రివర్స్ ప్లేట్ క్లబ్

23. 2017 ఆగస్టులో ప్రపంచ ఆరోగ్య సంస్థ ఏ దేశాన్ని 'పోలియో రహిత దేశం'గా ప్రకటించింది?
ఎ) సెనెగల్ బి) కాంగో
సి) సోమాలియా డి) పాకిస్థాన్

24. 'అండర్-19 ప్రపంచ కప్ క్రికెట్ టోర్నీ-2018'కి ఆతిథ్యం ఇస్తున్న దేశం?
ఎ) ఆస్ట్రేలియా బి) న్యూజిలాండ్
సి) ఇండియా డి) శ్రీలంక

25. భారత వ్యవసాయ శాఖ 2016-17కి గాను విడుదల చేసిన గణాంకాల ప్రకారం దేశంలో ఆహార ధాన్యాల ఉత్పత్తి(మిలియన్ టన్నుల్లో)
ఎ) 110.15 బి) 384.76 సి) 314.16 డి) 275.68

26. భారత్ ఏ దేశంతో కుదుర్చుకొన్న మేధోహక్కుల పరస్పర అవగాహన ఒప్పందాన్ని కేంద్ర కేబినెట్ ఇటీవల ఆమోదించింది?
ఎ) ఆస్ట్రియా బి) స్వీడన్ సి) ఫ్రాన్స్ డి) అమెరికా

27. హిందుస్థాన్ కాపర్ లిమిటెడ్ నూతన చీఫ్ మేనేజింగ్ డైరెక్టర్?
ఎ) సంతోష్‌శర్మ బి) మన్నెల్లి లక్ష్మీకాంతం
సి) సంజయ్‌గుప్తా డి) హర్షకుమార్ భన్వాల్

28. ఇటీవల విడుదలైన 'ఇండియా ఎట్ 70; స్నాప్ షాట్ సిన్స్ ఇండిపెండెన్స్' పుస్తక రచయిత?
ఎ) ఎన్.సి.ఉల్లేఖ్ బి) రోషెన్ దలాల్
సి) అమృత పర్ణీన్ డి) అరుంధతిరాయ్

29. మహారాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన 'నమో యువ రోజ్‌గార్ కేంద్ర' ప్రధాన ఉద్దేశం?
ఎ) యువ పారిశ్రామికవేత్తలకు రుణసౌకర్యం
బి) ఆర్గానిక్ కూరగాయలను తక్కువ ధరకు ప్రజలకు చేరువ చేయడం
సి) యువజన సంఘాల ఏర్పాటు ద్వారా ఐక్యత పెంపొందించడం
డి) రాష్ట్ర నిర్మాణంలో యువత నైపుణ్యాల వినియోగం

30. 2017 ఆగస్టు 18న దోమలను నిరోధించే ప్రత్యేక రైలును ప్రవేశపెట్టిన నగరం?
ఎ) ఢిల్లీ బి) బెంగళూరు
సి) చెన్నై డి) కోయంబత్తూర్

31. కేంద్రమంత్రి స్మృతి ఇరానీ ప్రారంభించిన చేనేత ఉత్పత్తి, ఎగుమతి సంస్థ 'ఒరియంట్ క్రాఫ్ట్ లిమిటెడ్' ఏ రాష్ట్రానికి చెందింది?
ఎ) ఛత్తీస్‌గఢ్ బి) జార్ఖండ్ సి) మధ్యప్రదేశ్ డి) కేరళ

32. 'ఇంటర్నేషనల్ క్రికెట్ కౌన్సిల్' 2017 ఆగస్టులో ప్రకటించిన వన్డే ర్యాంకింగ్స్‌లో తొలిస్థానం పొందిన బ్యాట్స్‌మన్?
ఎ) కేన్ విలియమ్సన్ బి) షకిబుల్ హసన్
సి) విరాట్ కోహ్లి డి) ఎవరూ కాదు

33. శ్రీలంక నేవీ చీఫ్‌గా నియమితులైన తమిళ సంతతి వ్యక్తి?
ఎ) కదిరగమర్. ఆర్ బి) డబ్ల్యూ.హెచ్.పెరెర
సి) పెరియార్ మురుగన్ డి) ట్రావిస్ సిన్నిహ్

34. ఎదగకుండా జన్మించిన శిశువుల పరిరక్షణ కోసం కృత్రిమ గర్భసంచిని రూపొందించింది?
ఎ) యూనివర్సిటీ ఆఫ్ వెస్టర్న్ ఆస్ట్రేలియా
బి) మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, అమెరికా
సి) టోక్యో యూనివర్సిటీ, జపాన్ డి) ఎ, సి

35. స్కూల్ టీచర్ల కోసం 'మేఘశాల' అనే మొబైల్ యాప్‌ను ప్రారంభించిన రాష్ట్రం?
ఎ) రాజస్థాన్ బి) తమిళనాడు
సి) కర్ణాటక డి) హర్యానా

క్రీడా పురస్కారాలు

36. 2017కిగాను 'రాజీవ్‌గాంధీ ఖేల్‌రత్న, అర్జున' అవార్డుల ఎంపిక కమిటీ చైర్మన్?
ఎ) ఎస్.కె.శర్మ బి) సి.కె.ఠక్కర్
సి) మేరీకోం డి) కరణం మల్లీశ్వరి

37. 2017కిగాను 'ధ్యాన్‌చంద్, ద్రోణాచార్య' అవార్డుల ఎంపిక కమిటీ చైర్మన్?
ఎ) మేరీకోం బి) కరణం మల్లీశ్వరి
సి) అభినవ్ బింద్రా డి) పుల్లెల గోపీచంద్

38. 2017కిగాను 'రాజీవ్‌గాంధీ ఖేల్‌రత్న'కి ఎంపికైన పారా అథ్లెట్ దేవేంద్ర ఝఝారియా ఏ క్రీడకు చెందిన వ్యక్తి?
ఎ) హైజంప్ బి) టెన్నిస్
సి) జావెలిన్ త్రో డి) షాట్‌పుట్

39. దేవేంద్రతోపాటు 2017కిగాను 'ఖేల్‌రత్న' పొందిన మరో క్రీడాకారుడు?
ఎ) ఎస్.ఎస్.పి.చౌరాసియా - గోల్ఫ్
